ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY





సూక్ష్మ సేద్యానికి మహర్దశ

● ఉమ్మడి జిల్లాలో 30 వేల హెక్టార్లకు డ్రిప్పు
● జగన్ హయాంలో అటకెక్కించిన దారుణం

కర్నూలు(అగ్రికల్చర్), ఆగస్టు 13: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సూక్ష్మ సేద్యానికి ప్రాధాన్యత ఇవ్వలేదు. వర్షాభావ పరిస్థితులు ఏటా ఎదుర్కొంటున్న కర్నూలు జిల్లాలోని పశ్చిమ ప్రాంత నియోజకవర్గాలైన డోన్, పత్తికొండ, ఆలూరు, ఎమ్మిగనూరు, ఆదోని తదితర నియోజకవర్గాల్లో భూగర్భజలమట్టం ఏటా తగ్గిపోతుండటంతో రైతులకు పంటల సాగు గగనమైపోతోంది. ఈ పరిస్థితుల్లో సూక్ష్మ సేద్యం విధానం ద్వారా నీటిని పొదుపుగా వినియోగించుకుని రెండు సీజన్లలో పంటలు సాగు చేసేందుకు వీలున్న బిందు, తుంపర్ల సేద్యానికి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పూర్తి స్థాయిలో ప్రాధాన్యత దక్కింది. కేంద్రం అందిస్తున్న ఆర్థిక సహకారంతో పాటు కొంత మొత్తాన్ని టీడీపీ ప్రభుత్వం కూడా రైతులకు సాయంగా అందించి పెద్ద ఎత్తున రాయలసీమలో కర్నూలు, నంద్యాల, చిత్తూరు, కడప, అనంతపురం జిల్లాల్లో సూక్ష్మ సేద్య విధానాన్ని అమలు చేసేందుకు పెద్ద ఎత్తున రైతులకు ప్రోత్సాహాన్ని అందించారు. అయితే.. గత వైసీపీ ప్రభుత్వం ఈ విధానానికి పూర్తిగా స్వస్తి పలకడంతో సూక్ష్మ సేద్యం అటకెక్కింది. ఐదేళ్ల పాలనలో రెండేళ్లు కరోనాతోనే గడిచిపోగా.. మిగిలిన చివరి మూడేళ్లలో వైసీపీ ప్రభుత్వం అరకొరగా..ఈ సూక్ష్మ సేద్యాన్ని అమలు చేసింది. కర్నూలు జిల్లాలో గత రెండేళ్ల నుంచి రైతుల పొలాల్లో డ్రిప్ పరికరాలను ఏర్పాటు చేసినందుకు ఆయా కంపెనీలకు చెల్లించాల్సిన సుమారు రూ.60 కోట్ల మొత్తాన్ని చెల్లించకపోవడంతో డ్రిప్ కంపెనీలు మళ్లీ రైతుల పొలాల్లో డ్రిప్‌ను ఏర్పాటు చేసేందుకు ఏ మాత్రం ఆసక్తి చూపడం లేదు. ఈ పరిస్థితుల్లో టీడీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో పెద్ద ఎత్తున సూక్ష్మ సేద్యానికి బాటలు వేసే కార్యక్రమం మొదలైంది. కర్నూలు జిల్లాలో 15వేల హెక్టార్లు, నంద్యాల జిల్లాలో 15 వేల హెక్టార్లు మొత్తం 30వేల హెక్టార్లలో ఈ సంవత్సరం డ్రిప్ పనిముట్లను ఏర్పాటు చేసేందుకు టీడీపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈ సంవత్సరం డ్రిప్ పరికరాలు అవసరమైన వారిని గుర్తించే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టేందుకు ఏపీఎంఐపీ అధికారులు గ్రామాల బాట పట్టారు. రైతులకు అవకాశం కల్పించి రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ప్రారంభించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ సూక్ష్మ సేద్య పథకాన్ని అమలు చేసేందుకు దాదాపు లక్ష హెక్టార్లు అనుకూలంగా ఉందని ఏపీఎంఐపీ అధికార వర్గాలు తెలిపాయి.

రాయితీ వివరాలు


ఐదెకరాలలోపు పొలం ఉన్న చిన్న, సన్నకారు రైతులకు ఈ పథకం కింద 90 శాతం రాయితీ ఇస్తారు. 5 నుంచి 12.5 ఎకరాల్లోపు పొలం వున్న రైతులకు 50 శాతం రాయితీ ఇస్తారు. ఇక స్ప్రింకర్ల ఏర్పాటుకు సన్న, చిన్నకారు రైతులకు 55 శాతం, పెద్ద రైతులకు 45 శాతం రాయితీ కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. డ్రిప్ పరికరాలు కావాలనుకునే రైతులు ఆధార్, భూమి యాజమాన్య పత్రం జత చేసి మండల ఉద్యాన శాఖ అధికారి లేదా, గ్రామ ఉద్యాన సహాయకుడు, గ్రామ వ్యవసాయ సహాయకుడు, గ్రామ సెరికల్చర్ సహాయకులు, సూక్ష్మ నీటి పారుదల ప్రాంతాలతో గానీ లేక గ్రామ రైతు సేవా కేంద్రంతో పాటు మైక్రో ఇరిగేషన్ కార్యాలయంలో బయోమెట్రి ద్వారా గానీ తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు. అదే విధంగా కంపెనీలు అనాసక్తి చూపకుండా రాష్ట్ర ప్రభుత్వం బకాయి మొత్తాలను విడుదల చేసేందుకు నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు రూ.1,167 కోట్ల బకాయిలు ఉన్నాయని, అందులో దాదాపు రూ.176 కోట్లు మొదటి విడత ఆయా కంపెనీలకు ప్రభుత్వం విడుదల చేసిందని, దీని వల్ల రైతులు ఎటువంటి సందేహాలు పెట్టుకోకుండా డ్రిప్ ఇరిగేషన్‌కు ఆసక్తి చూపాలని తమ పొలాల్లో ఈ పరికరాలను ఏర్పాటు చేసుకుని పంటలు సాగు చేయాలని అధికారులు తెలుపుతున్నారు.

రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలో 30వేల హెక్టార్లల్లో డ్రిప్పు సేద్యాన్ని రైతులకు వర్తింపజేసేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. 90 శాతం దాకా రాయితీ అందిస్తున్న ఈ పథకాన్ని బోర్ల కింద పంటలు సాగు చేస్తున్న రైతులంతా ఉపయోగించుకోవాలి. వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొంటున్న రైతులకు డ్రిప్పు విధానం ఎంతో అనువైనది. ప్రస్తుతం గ్రామాల్లో రైతు సలహా కేంద్రాలతో పాటు మా శాఖ సిబ్బంది డ్రిప్పుపై రైతులకు అవగాహన కల్పించి పేర్ల నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నారు.

-ఉమాదేవి, ఏపీఎంఐపీ పీడీ



పొలాల్లో ఏర్పాటు చేయనున్న డ్రిప్ పరికరాలు

వినియోగదారులకు మెరుగైన సేవలందించాలి

● అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాల్సిందే
● ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు



ఉమ్మడి కర్నూలు జిల్లా అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న సీఎండీ కే.సంతోషరావు

కల్లూరు, ఆగస్టు 13: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలందించేలా అధికారులు సిబ్బంది కృషి చేయాలని ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ కే.సంతోషరావు ఆదేశించారు. నగరంలోని విద్యుత్‌భవన్ సమావేశ మందిరంలో మంగళవారం ఆయన ఉమ్మడి కర్నూలు జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గించాలని సమస్య ఎర్పడిన వెంటనే స్పందించి పునరుద్ధరించాలన్నారు. విద్యుత్ ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, మండల, గ్రామ స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజలు, రైతులను అప్రమత్తం చేయాలన్నారు. విద్యుత్ నియంత్రికలు కాలిపోకుండా తగు చర్యలు తీసుకోవాలని, వందశాతం విద్యుత్ బిల్లులు వసూలు చేయాలని ఆదేశించారు. అధికలోడు ఉండే 33 కేవీ, 12 కేవీ లైన్లకు అదనంగా కొత్త ఫీడర్లను నిర్మించడానికి తగు చర్యలు తీసుకుని, లోటల్టేజీ సమస్యను పరిష్కరించాలని తెలిపారు. రోడ్డు క్రాసింగ్ లైన్లు ఎత్తు పెంపు, లైన్ల నిర్వహణపై అశ్రద్ధ వహించకూడదని ఆదేశించారు. పట్టణ, మండల కేంద్రాల్లో పనిచేస్తున్న అధికారులు సిబ్బంది హెడ్‌క్వార్టర్స్‌లో నివాసం ఉంటూ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి సూర్యఘర్ గురించి ప్రజలకు అవగాహన కల్పించి గ్రామాల్లో ప్రచారం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్, మెయింటెనెన్స్ సీజీఎం ఆర్.పద్మ, ఆర్.ఏఐ సీజీఎం కెఆర్ఎస్.ధర్మజ్ఞాని, కర్నూలు ఎస్ఈ యం.ఉమాపతి, ఎస్ఏఓ చిన్నరాఘవులు, డీఈలు, ఏడీఈలు, ఏఈలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎండీకి వినతి: వి.ఈ.డబ్ల్యూగా చేసిన సర్వీసును పెన్షన్ సర్వీస్‌కు కలపాలని ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ కే.సంతోషరావుకు రిటైర్డ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ కర్నూలు జిల్లా అధ్యక్షుడు కె.నాగమల్లేశ్వరావు వినతిపత్రం అందించారు. మూడు దశాబ్దాలకు పైగా విద్యుత్ సంస్థకు సేలందించిన విలేజ్ ఎలక్ట్రిసిటీ వర్కర్లు చేసిన సర్వీస్‌ను దృష్టిలో ఉంచుకుని వారికి పెన్షన్ వర్తింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి పి.నాగరాజు, కేవీ భాస్కర్‌రెడ్డి, అహమ్మద్‌బాషా, వీరభద్రప్ప పాల్గొన్నారు.

రెండో విడతలోనే అన్న క్యాంటీన్లు!

జిల్లా వ్యాప్తంగా నెలాఖరులో ప్రారంభించే అవకాశం



ఆత్మకూరు, ఆగస్టు 13: రాష్ట్రంలో పేదల ఆకలి తీర్చేందుకు కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించేందుకు శ్రీకారం చుట్టింది. ఆగస్టు 15వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా అన్నక్యాంటీన్లను తెరిచేందుకు సన్నాహాలు చేసింది. అయితే కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మాత్రం క్యాంటీన్ల ప్రారంభం కాస్త ఆలస్యం కానుంది. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా 17 ఉన్న క్యాంటీన్లకు సర్వం సిద్ధం చేశారు. వీటిలో కర్నూలులో 5, ఆదోనిలో 3, నంద్యాలలో 2, ఎమ్మిగనూరులో 2, డోన్, ఆళ్లగడ్డ, నందికొట్కూరు, ఆత్మకూరు, గూడూరు మున్సిపాలిటీల్లో ఒక్కొక్కటి చొప్పున సిద్ధం అయ్యాయి. అయితే భోజన నిర్వహణ కాంట్రాక్ట్‌ను ఇస్కాన్ సంస్థకు అప్పగించారు. ఒప్పంద సంస్థ కాస్త జాప్యం వహించడంతో తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఈ నెలాఖరుకు జిల్లా వ్యాప్తంగా అన్న క్యాంటీన్ల ప్రారంభానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

పోలీసుల విస్తృత దాడులు

నంద్యాల క్రైం, ఆగస్టు 13: జిల్లా వ్యాప్తంగా పోలీసులు మంగళ వారం విస్తృతదాడులు నిర్వహించారు. ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు జరిగిన ఈ దాడుల్లో 8డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసి 11మందిని అరెస్ట్ చేశారు. బహిరంగంగా మద్యం సేవిస్తున్న 69మందిపై కేసులు నమోదు చేశారు. ఆత్మకూరు సబ్ డివిజన్‌లో పేకాట ఆడుతున్న 14మందిని అరెస్ట్ చేసి రూ.40,310 స్వాధీనం చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో నాటుసారా బట్టీలపై దాడులు చేసి 7కేసులు నమోదు చేసి 330లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. 4డీపీఎల్ కేసులు నమోదు చేసి 18 లీటర్ల అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నారు. అలాగే మోటార్ వెహికల్ చట్టం కింద 163 కేసులు నమోదు చేసి రూ.56,100 జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా మాట్లాడుతూ జిల్లాలో విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్నామన్నారు.

నాటుసారా బట్టీలపై దాడులు

ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు ఆత్మకూరు సబ్ డివిజన్‌లో నాటుసారా బట్టీలపై ఆకస్మిక దాడులు నిర్వహించినట్లు సెబ్ అధికారులు తెలిపారు. మంగళవారం ఆత్మకూరు సెబ్ స్టేషన్ పరిధిలోని సిద్ధాపురం చుట్టుపక్కల ఉన్న అడవిలో, వంకల్లో ఆత్మకూరు సెబ్ స్టేషన్ సిబ్బంది, సివిల్ పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో సుమారు 600 లీటర్ల బెల్లపు ఊటను, 10లీటర్ల సారాను ధ్వంసం చేసి కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఆత్మకూరు సెబ్ సీఐ మారుతిరావు, సెబ్ ఎస్సై రాజశేఖర్, కానిస్టేబుళ్లు జగదీష్, రమేష్, రంగస్వామి, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కృష్ణా బోర్డును కర్నూలులోనే ఏర్పాటు చేయాలి

ముఖ్యమంత్రి, రాయలసీమ ప్రజాప్రతినిధులకు సాగునీటి సాధన సమితి లేఖ

నంద్యాల టౌన్, ఆగస్టు 13 : సాగునీటి రంగంలో అత్యంత వెనుకబడిన రాయలసీమ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే కృష్ణా నది యాజమాన్య బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేశారు. కేఆర్ఎంబీ కార్యాలయంలో కర్నూలులో ఏర్పాటు ఆవశ్యకతపై సమగ్ర వివరణతో కూడిన లేఖను మంగళవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు, రాయలసీమ సాగునీటి సాధన సమితి తరవున బొజ్జా మెయిల్ ద్వారా లేఖ పంపారు. ఈ సందర్భంగా నంద్యాల సమితి కార్యాలయంలో దశరథరామిరెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన చట్టం ప్రకారం కృష్ణా నది యాజమాన్య బోర్డు కార్యాలయం ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయాలని, రాష్ట్రం విడిపోయి పది సంవత్సరాలు దాటినా కార్యాలయం హైదరాబాద్ కేంద్రంగా కొనసాగుతున్నదని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం కృష్ణానదికి ఏ విధంగా సంబంధం లేని విశాఖపట్నంలో ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నదని అన్నారు. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి నాగార్జున సాగర్ ద్వారా కృష్ణా డెల్టాకు విడుదల చేయాల్సిన 80 టీఎంసీలు కృష్ణా జలాలకు బదులుగా పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణాడెల్టా పొందుతున్నదని, దీనితో శ్రీశైలం రిజర్వాయర్ నుంచి కృష్ణా జలాలను కృష్ణా డెల్టాకు విడుదల చేయ్యాల్సిన అవసరం లేదన్నారు. కృష్ణానది యాజమాన్య బోర్డు కార్యాలయం కర్నూలులో ఏర్పాటు దిశగా ముఖ్యమంత్రి సానుకూల నిర్ణయం తీసుకునేలా రాయలసీమ శాసన, శాసన మండలి, పార్లమెంట్ సభ్యులు క్రియాశీలకంగా వ్యవహరించాలని బొజ్జా విజ్ఞప్తి చేశారు.

దేశాభివృద్ధికి అంకితం కావాలి: మంత్రి ఫరూక్

నంద్యాల (కల్చరల్), ఆగస్టు 13: దేశం కోసం ప్రాణత్యాగాలు చేసిన మహనీయుల స్మరించుకుంటూ దేశాభివృద్ధికి అంకితం కావాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పిలుపునిచ్చారు. మంగళవారం హర్‌ఘర్ తిరంగ కార్యక్రమంలో భాగంగా టెక్క మార్కెట్ యార్డు నుంచి ర్యాలీని మంత్రితో పాటు కలెక్టర్ రాజకుమారి ప్రారంభించారు. మార్కెట్ యార్డు నుంచి గాంధీచౌక్ వరకు 100 మీటర్ల భారీ జాతీయ జెండా ప్రదర్శనతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ప్రతిఇంటిపై జాతీయపతాకాన్ని ఆవిష్కరించాలన్నారు. అతి పెద్ద ప్రజాసామ్యమైన భారతదేశంలో కులాలు, మతాలు, విభిన్న జాతులు మమేకమై దేశ పురోభివృద్ధికి పాటుపడాలన్నారు. దేశ సంస్కృతీ, సంప్రదాయాలను గౌరవవిస్తూ వాటిని యువత కాపాడుకోవాలని సూచించారు. అనంతరం గాంధీచౌక్‌లోని గాంధీ విగ్రహానికి పూలమాలలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్, డీఆర్వో పద్మజ, డీటీఓ శివారెడ్డి, పర్యాటక శాఖ అధికారి సత్యనారాయణ, డీసీహెచ్ఎస్ డాక్టర్ జప్రుల్లా, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, విద్యార్థి సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.




నంద్యాలలో 100మీటర్ల భారీ జాతీయజెండా ప్రదర్శన



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఫరూక్

శ్రీశైలానికి 77,598 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



శ్రీశైలం, ఆగస్టు 13: ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం స్వల్పంగా కొనసాగుతోంది. మంగళవారం సాయంత్రం 6 గంటల సమయానికి సుంకేసుల నుంచి 77,598 క్యూసెక్కుల వరద వస్తోంది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 880.80 అడుగులుగా నమోదైంది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 192.53 టీఎంసీలుగా నమోదైంది. ఆంధ్రప్రదేశ్ జల విద్యుత్ కేంద్రం ద్వారా 30,671 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 37,540 క్యూసెక్కుల మొత్తం 68,211 క్యూసెక్కుల నీటిని విద్యుత్ ఉత్పత్తి చేస్తూ దిగువ నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

తాత్కాలిక గేటు తయారీలో ఇంజనీర్లు

● కొట్టుకుపోయిన గేటును పరిశీలించిన మంత్రులు, ఎంపీ
● టీబీపీ డ్యాంకు చేరుకున్న సీఈ కబీర్‌బాషా

కర్నూలు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కొట్టుకుపోయిన తుంగభద్ర డ్యాం 19వ గేటు స్థానంలో తాత్కాలిక గేటు ఏర్పాటు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. డ్యాంకు వరద తగ్గడంతో ఎత్తిన గేట్లు దింపుతుండగా శనివారం రాత్రి చైన్‌లింక్ తెగిపోయి గేటు కొట్టుకుపోయిన సంగతి తెలిసిందే. మరమ్మతు కోసం జలాశయంలో నిల్వ ఉన్న 105.788 టీఎంసీల్లో 65 టీఎంసీలు వృథాగా వదిలేస్తున్నారు. రాయలసీమ జిల్లాలు కర్నూలు, అనంతపురం, కడప ప్రాంతాల్లో ఎల్లెల్సీ, హెచ్చెల్సీ, కేసీ కాలువ కింద ఆయకట్టు రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉంది. కనీసం ఖరీఫ్ సాగుకైనా సాగునీరు ఇవ్వాలనే లక్ష్యంగా టీబీపీ బోర్డు సహా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ఇంజనీర్లు, ప్రజాప్రతినిధులు మరమ్మతులపై దృష్టి సారించారు.

తుంగభద్ర డ్యాం గేటు మరమ్మతుల్లో జిల్లాకు చెందిన ఇంజనీర్లు కృషి చేస్తున్నారు. తుంగభద్ర డ్యాం ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ ఉమ్మడి ప్రాజెక్టు కావడంతో నిర్వహణ కోసం 35 శాతం నిధులు ఇవ్వాల్సి ఉంటుంది. గేటు కొట్టుకుపోయిన విషయం తెలియగానే సీఎం చంద్రబాబు తక్షణమే స్పందించారు. సీఈ సీడీవో కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని పంపారు. జలవనరుల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సాయిప్రసాద్ డ్యాంలో ఉంటూ పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే కర్నూలు ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ రెడ్డిశేఖర్‌రెడ్డి డ్యాంకు చేరుకొని మరమ్మతు పనుల్లో నిమగ్నమయ్యారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ఉమ్మడి కర్నూలు జిల్లాల ప్రాజెక్ట్ సీఈ కబీర్‌బాషా మంగళవారం హోస్పెట్‌కు చేరుకొని డ్యాం గేటు మరమ్మతు పనుల్లో నిమగ్నమయ్యారు. హోసహళ్లి దగ్గర నారాయణ ఇంజనీరింగ్ వర్క్స్, హిందుస్తాన్ ఇంజనీరింగ్ వర్క్స్ సంస్థలకు చెందిన వర్క్ షాపుల్లో జరుగుతున్న స్టాప్‌లాగ్ ఎలిమెంట్ తాత్కాలిక గేటు తయారీ పనులను పరిశీలించారు. అలాగే రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఆలూరు టీడీపీ నేత బి. వీరభద్రగౌడ్ తదితరులు డ్యాంను సందర్శించారు. వీరికి డ్యాం డిజైన్, మరమ్మతులు, స్టాప్‌లాగ్ తయారీపై గేట్స్ ఎక్స్‌పర్ట్ కన్నయ్యనాయుడు వివరించారు.



తుంగభద్ర డ్యాం డిజైన్, తాత్కాలిక గేట్ ఏర్పాటుపై మంత్రులు, ఎంపీకి వివరిస్తున్న కన్నయ్యనాయుడు

ఐదారు రోజుల్లో స్టాప్‌లాగ్ గేటు ఏర్పాటు

తుంగభద్ర డ్యాంలో కొట్టుకుపోయిన 19వ గేటు స్థానంలో తాత్కాలిక స్టాప్‌లాగ్ గేటు ఏర్పాటుకు వేగంగా పనులు చేస్తున్నారు. ప్రాజెక్టుల గేట్ల నిపుణులు కన్నయ్యనాయుడు పర్యవేక్షణలో మరమ్మతుల్లో ఇంజనీర్ల కృషి అభినందనీయం. జరుగుతున్న పనులు చూస్తే ఐదారు రోజుల్లో తాత్కాలిక గేటు ఏర్పాటు పనులు పూర్తి అవుతాయి. ఖరీఫ్‌కు సాగునీరు ఇబ్బంది లేకుండా త్వరితగతిన మరమ్మతులు పూర్తి చేయాలని బోర్డు అధికారులను కోరితే సానుకూలంగా స్పందించారు.

- బస్తిపాటి నాగరాజు, ఎంపీ, కర్నూలు

తుంగభద్ర ఉధృతిని పరిశీలించిన ఎస్పీ

- ఉత్సవాలకు 300 మందితో బందోబస్తు
- నదీతీరంలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు



నదీతీరాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ బిందు మాధవ్

మంత్రాలయం, ఆగస్టు 13: మంత్రాలయం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న తుంగభద్ర నది ప్రవాహాన్ని ఎస్పీ జి. బిందు మాధవ్ పరిశీలించారు. మంగళవారం సాయంత్రం నదీతీర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం శ్రీమఠం ప్రాంగణం, పార్కింగ్, పోలీస్ స్టేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాఘవేంద్ర స్వామి 353వ ఆరాధనోత్సవాలకు 300 మంది పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో పది మంది సీఐలు, 20 మంది ఎస్‌ఐలు, 40 మంది ఏఎస్‌ఐలు, 200 మంది పోలీసులు స్పెషల్ పార్టీ, ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది, మహిళా పోలీసులతో పాటు హోంగార్డ్స్, మఠం సెక్యూరిటీతో బందోబస్తు నిర్వహించి ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. పార్కింగ్, క్యూలైన్లు, వీఐపీల ప్రొటోకాల్, భోజన వసతి దగ్గర తొక్కిసలాట జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ పరిశీలనలో ఆదోని డీఎస్పీ సోమన్న, మంత్రాలయం సీఐ రామాంజులు, స్పెషల్ బ్రాంచ్ సీఐ నాగరాజు యాదవ్, ఎస్‌ఐలు వేణుగోపాల్ రాజు, క్రిష్ణమూర్తి పాల్గొన్నారు.

ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక నిఘా: ఎస్పీ బిందుమాధవ్

గోనెగండ్ల, ఆగస్టు 13: జిల్లాలోని ఫాక్షన్ గ్రామాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు. మంగళవారం గోనెగండ్ల మండల పరిధిలో ఫాక్షన్ గ్రామమైన కున్నూరు గ్రామాన్ని ఆయన సందర్శించారు. జిల్లా ఉన్న ఫాక్షన్ గ్రామాలలో ఆయన పర్యటిస్తు అక్కడి పరస్థితులను అంచానా వేస్తున్నారు. అందులో బాగంగా కున్నూరుకు మంగళవారం ఎస్పీ వచ్చారు. గ్రామంలో ఫ్యాక్షన్ విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం గ్రామంలో ఫ్యాక్షన్ గొడవలు ఉన్నాయా అని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో సీఐ గంగాధర్, స్పెషల్ బ్రాంచ్ సీఐ నాగరాజు యాదవ్, స్పెషల్ బ్రాంచ్ ఎస్‌ఐ వేణుగోపాల్, పోలీసులు పాల్గొన్నారు.

మానసిక వికలాంగులకు చట్టపరమైన హక్కులు

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి



ప్రసంగిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి

కర్నూలు(లీగల్), ఆగస్టు 13: సమాజంలో మానసిక వికలాంగులు కూడా ఒక భాగమేనని వారికి కూడా చట్టపరమైన హక్కులు ఉంటాయని జిల్లా న్యాయసేవాదికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి తెలిపారు. మంగళవారం కల్లూరు మండలంలోని చిన్నటేకూరు, ఉలిందకొండ గ్రామాల్లో న్యాయ అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక రుగ్మతలతో బాధపడుతున్న తమకు ఏమైనా సమస్యలు ఎదురైతే న్యాయ సేవాధికార సంస్థను ఆశ్రయించి ఉచిత న్యాయ సహాయాన్ని పొందవచ్చని తెలిపారు. వితంతు పింఛన్, వినియోగదారుల హక్కుల గురించి ఆయన వివరిస్తూ సత్వర న్యాయాన్ని అందించేందుకు శాశ్వత లోక్ అదాలత్‌ను కూడా ఏర్పాటు చేశామన్నారు. ఈ శాశ్వత లోక్ అదాలత్‌లో ఎలాంటి కోర్టు ఫీజులు లేకుండా సత్వర న్యాయాన్ని పొందవచ్చని తెలిపారు. పెండింగ్ కేసులే కాకుండా ఇంకా దాఖలు కానీ ప్రిలిటిగేషన్ కేసులు కూడా లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ సెక్రటరీ నాగేశ్వరరావు, డీపీవో నాగరాజు నాయుడు, ఎంపీడీవో చంద్రశేఖర్, సర్పంచ్ లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన వృద్ధురాలు



నరసమ్మ

ఎమ్మిగనూరు, ఆగస్టు13: ఎమ్మిగనూరు పట్టణంలోని కుమ్మరి వీధిలో నివాసం ఉంటున్న చాకలి నరసమ్మ(70) గత కొన్ని రోజులుగా కనిపించకుండా పోయిందని పట్టణ పోలీసు స్టేషన్‌లో ఆమె కుమారుడు రామన్న ఫిర్యాదు చేశారు. ఇటీవల నందవరం మండలం ముగతి గ్రామంలో తన కుమార్తెను చూసి వస్తానని నరసమ్మ బయటకు వచ్చింది. అయితే కూతురు ఇంటికి చేరుకోలేదు. తిరిగి ఎమ్మిగనూరులోని ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లోని బంధువుల ఇళ్ల దగ్గర వెతికారు. ఎక్కడా ఆచూకి లేకపోవడంతో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసినవారు సెల్:9025551638, 8300105314లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కర్నూలు రేంజ్ పరిధిలో 62 మంది సీఐల బదిలీ

కర్నూలు, ఆగస్టు 13: కర్నూలు అనంతపురం రేంజ్ పరిధిలో కర్నూలు, నంద్యాల, అన్నమయ్య, కడప జిల్లాల్లో 62 మంది సీఐలను బదిలీ చేస్తూ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి కడప అన్నమయ్య జిల్లాలకు, కడప, అన్నమయ్య జిల్లాల నుంచి కర్నూలు, నంద్యాల జిల్లాలకు 29 మంది సీఐలను బదిలీ అయ్యారు. కడప నుంచి అన్నమయ్య జిల్లాకు, అన్నమయ్య నుంచి కడపకు 33 మంది సీఐలను బదిలీ చేశారు.

సీఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఎం.రామయ్య నాయుడు	కర్నూలు టూటౌన్	కర్నూలు వన్‌టౌన్
వై.పవన్ కుమార్	కర్నూలు వన్‌టౌన్	ఫ్యాక్షన్ జోన్, కర్నూలు
బి.మధుసూదన్ గౌడు	సీఐడీ, ఆర్‌వో, కర్నూలు	కర్నూలు ఫోర్త్‌టౌన్
పి.శంకరయ్య	కర్నూలు ఫోర్త్ టౌన్	వీఆర్‌ఎస్‌పీ, కర్నూలు
ఎం.తబ్రేజ్	వీఆర్, అనంతపురం	కోడుమూరు సర్కిల్
ఎస్.మన్సూరుద్దీన్	కోడుమూరు సర్కిల్	వీఆర్‌ఎస్‌పీ, కర్నూలు
ఎస్‌కే ఇస్మాయిల్	నంద్యాల ట్రాఫిక్	నంద్యాల టూటౌన్
కే.రాజారెడ్డి	నంద్యాల టూటౌన్	బి.కొత్తకోట, అన్నమయ్య జిల్లా
ఎస్.అస్రార్ బాషా	వీఆర్‌ఎస్‌పీ, నంద్యాల	నంద్యాల టూటౌన్
టి.నరసింహులు	నంద్యాల త్రీటౌన్	వీఆర్‌ఎస్‌పీ, నంద్యాల
ఎస్.సూర్య మౌళి	డీఎస్‌బీ, నంద్యాల	నంద్యాల తాలుకా
బి.శ్రీనివాసరెడ్డి	డీఎస్‌బీ-2, కర్నూలు	నంద్యాల రూరల్
ఎన్.శివకుమార్ రెడ్డి	నంద్యాల రూరల్	వీఆర్‌ఎస్‌పీ, నంద్యాల
ఎస్.వంశీధర్	ఫ్యాక్షన్ జోన్, నంద్యాల	సిరివెళ్ల సర్కిల్
జి.చంద్రబాబు	సిరివెళ్ల సర్కిల్	శ్రీశైలం టూటౌన్
జే.రమేష్ కుమార్	శ్రీశైలం టూటౌన్	వీఆర్‌ఎస్‌పీ, నంద్యాల
ఎన్.కృష్ణయ్య	మహిళా పోలీస్ స్టేషన్, అన్నమయ్య జిల్లా	బనగానపల్లె యుపీఎస్, నంద్యాల
జి.ఇబ్రహీం	కడప టూటౌన్	సీసీఎస్, కర్నూలు
బీవీ రమణ	వీఆర్, నంద్యాల	రాజంపేట రూరల్, అన్నమయ్య
ఎం. శ్రీనాథరెడ్డి	వీఆర్‌ఎస్‌పీ, కడప	డీఎస్‌బీ-2, కర్నూలు
వి.శ్రీనివాసులు	వీఆర్‌ఎస్‌పీ, కర్నూలు	సోషల్ మీడియా, సైబర్ క్రైమ్ సెల్, కర్నూలు
ఏ.వేణుగోపాల్	సోషల్ మీడియా, సైబర్ క్రైమ్‌సెల్, కర్నూలు	వీఆర్‌ఎస్‌పీ, కర్నూలు
ఎం.ఆదిలక్ష్మమ్మ	వీఆర్‌ఎస్‌పీ, కర్నూలు	ఉమెన్ పీఎస్, కర్నూలు
డి.హాజీవలి	ఉమెన్ పీఎస్, కర్నూలు	పులివెందుల ట్రాఫిక్
ఎల్. విజయలక్ష్మి	పీసీఆర్, ఆదోని	డీటీఆర్‌బీ, కర్నూలు
ఏ.ఆదినారాయణ రెడ్డి	డీటీఆర్‌బీ, కర్నూలు	వీఆర్‌ఎస్‌పీ, కర్నూలు
జి.సుబ్బారావు	వీఆర్‌ఎస్‌పీ, నంద్యాల	ఆదోని ట్రాఫిక్ పీఎస్
సి.భాస్కర్ రెడ్డి	వీఆర్‌ఆర్‌వో, కర్నూలు	డీసీఆర్‌బీ, కడప
ఎం.నాగ శేఖర్	డీపీటీసీ, అన్నమయ్య	వీఆర్, రేంజ్ ఆఫీస్, కర్నూలు

అప్పులు తీర్చలేక తనువు చాలించిన అన్నదాతలు

వేర్వేరు చోట్ల ఇద్దరు రైతుల బలవన్మరణం



లక్ష్మానాయక్(ఫైల్) మిద్దె కృష్ణయ్య(ఫైల్)

చాగలమర్రి/దొర్నిపాడు, ఆగస్టు 13: అప్పులు అధికమై.. పంటలు దక్కక తీవ్ర ఒత్తిడికి లోనై నంద్యాల జిల్లాకు చెందిన ఇద్దరు రైతులు మంగళవారం ఆత్మహత్య చేసుకున్నారు. చాగలమర్రి మండలం ఎం.తండ గ్రామంలో రైతు లక్ష్మానాయక్ (46), దొర్నిపాడు మండల కేంద్రానికి చెందిన బుడ్డమిద్దె కృష్ణయ్య(50) బలవన్మరణానికి పాల్పడ్డారు. చాగలమర్రి మండలం ఎం.తండా గ్రామానికి చెందిన లక్ష్మానాయక్ తనకున్న ఆరు ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేశాడు. ఇందుకోసం పలుచోట్ల రూ.7లక్షలకు పైగా అప్పులు చేశాడు. ప్రకృతి సహకరించకపోవడంతో పంటలు దక్కలేదు. ఇదే సమయంలో రుణదాతల నుంచి ఒత్తిళ్లు అధికం కావడంతో మంగళవారం సొంతపొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు గమనించి కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో లక్ష్మానాయక్ మృతి చెందాడు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు సంతానం. చాగలమర్రి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. అదేవిధంగా దొర్నిపాడు మండల కేంద్రానికి చెందిన బుడ్డమిద్దె కృష్ణయ్య (50) అనే కౌలు రైతు తనకున్న 1.5 ఎకరాల పొలంతో పాటు మరికొంత భూమిని కౌలుకు తీసుకొని పత్తి, మిరప, సాగు చేశాడు. పెట్టుబడుల కోసం రూ.15 లక్షలు దాకా అప్పులు చేశాడు. అప్పులు తీర్చలేక మదనపడిన రైతు కృష్ణయ్య సోమవారం అర్ధరాత్రి పురుగుల మందు తాగాడు. పక్కపొలంలోని రైతులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆయన కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య ఈశ్వరమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో రాజీపడొద్దు

పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం, ఆగస్టు 13: మంత్రాలయం రాఘవేంద్రస్వామి ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు అన్ని రకాల వసతులు కల్పించడంలో రాజీ పడవద్దని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు అన్నారు. సోమవారం రాత్రి ఊంజల మండపం ప్రాంగణంలో ఉత్సవాల ఏర్పాట్లపై శ్రీమఠంలోని అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తాగునీరు, వైద్యం, పరిమళ ప్రసాదం, వసతి, పరిశుభ్రత, క్యూలైన్లు, రథోత్సవాల ఊరేగింపు, అన్నదానం, ట్రాఫిక్, పార్కింగ్ వంటి ఏర్పాట్లపై చర్చించారు. ఈ ఏడాది 5 లక్షలకు పైగా భక్తులు రావచ్చని అంచనా చేసిన పీఠాధిపతి భక్తులకు తగ్గట్టుగా ఏర్పాట్లలో రాజీ పడొద్దన్నారు. ఈ సమావేశంలో మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషీ, అప్రమేయాచార్, డా.సుధీంద్ర, సూపరింటెండెంట్లు విజయేంద్రాచార్, రవి కులకర్ణి, వ్యాసరాజాచార్, శ్రీహరి, దేశాయ్ నరసింహ, ఈఈ సురేష్ కోనాపూర్, ఏఈ బద్రినాథ్, శ్రీహరి పాల్గొన్నారు.

ఉత్సవాలకు సీఎం చంద్రబాబుకు ఆహ్వానం



ముఖ్యమంత్రికి ఆహ్వాన పత్రిక ఇస్తున్న ఐపీ నరసింహమూర్తి, అనంతపురానిక్

రాఘవేంద్రస్వామి 353వ సప్తరాత్రోత్సవాలు ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు జరగనున్నందున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు శ్రీమఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, సూపరింటెండెంట్ అనంతపురానిక్ అహ్వాన పత్రికను అందజేశారు. మంగళవారం అమరావతిలోని సీఎం కార్యాలయంలో నారా చంద్రబాబు నాయుడును కలిసి ఆహ్వాన పత్రిక, స్వామివారి శేషవస్త్రం, మెమెంటో, ఫలపుష్ప మంత్రాక్షితలు అందజేశారు. దేవదాయ శాఖ మంత్రి ఆనం నారాయణ రెడ్డి, రాష్ట్ర మంత్రి నారాయణకు కూడా ఆహ్వాన పత్రికను అందజేశారు.

ఉరుకుంద హుండీ ఆదాయం రూ. 1.7 కోట్లు



హుండీ లెక్కింపులో పాల్గొన్న సిబ్బంది

కౌతాళం ఆగస్టు 13: మండలంలోని ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానంలో శ్రావణ మాసపు ఉత్సవాల సందర్భంగా రెండో సోమవారం భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపు దేవస్థానపు కాలక్షేపపు మండపంలో మంగళవారం ఆలయ డిప్యూటీ కమీషనర్ గురుప్రసాద్ ఆధ్వర్యంలో జరిగింది. నగదు రూపంలో రూ.1,07,72,969, బంగారం 52 గ్రాములు, వెండి 19.7 కిలోలు, ఆస్ట్రేలియా కరెన్సీ 50 డాలర్లు, అమెరికన్ కరెన్సీ 184 డాలర్లు వచ్చినట్లు గురుప్రసాద్ తెలిపారు.

సంక్షిప్త ఓటరు జాబితా ప్రచురించండి

అధికారులను ఆదేశించిన ఎలక్షన్ కమిషన్

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 13: 2025 జనవరి 6వ తేదీ నాటికి సంక్షిప్త సవరణ ఓటర్ల తుది జాబితాను ప్రచురించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వివేక్ యాదవ్ జిల్లా అధికారులను ఆదేశించారు. విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి ఎన్నికల సమ్మరి రివిజన్, తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా రూపొందించడానికి ఆగస్టు 20 నుంచి అక్టోబరు 18వ తేదీ వరకు బీఎల్‌వోలు ఇంటింటి ఓటర్లసర్వే ప్రక్రియ చేపట్టాలన్నారు. అక్టోబరు 19 నుంచి 28వ తేదీ వరకు దరఖాస్తుల పరిశీలన కార్యక్రమం నిర్వహించాలన్నారు. అక్టోబరు 29వ తేదీన సంక్షిప్త ముసాయిదా ఓటర్ల జాబితా రూపొందించాలన్నారు. సెప్టెంబరు 29 నుంచి నవంబరు 28వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించాలన్నారు. డిసెంబరు 24లోగా అభ్యంతరాలపై వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా పాటించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పి.రంజిత్ బాషా, ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో కే.మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న ఆటో - ఇద్దరు మృతి

పాణ్యం, ఆగస్టు 13 : స్థానిక డొంగు రస్తా వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందినట్లు పాణ్యం ఎస్‌ఐ అశోక్ తెలిపారు. నంద్యాల దేవనగర్‌కు చెందిన శేషయ్య, సాయిబాబానగర్‌కు చెందిన సుబ్బయ్య మంగళవారం ఉదయం ఆటోలో పాణ్యం ఇందిరానగర్‌కు చేరుకొని పని ముగించుకొని డొంగు వద్ద జాతీయ రహదారి దాటుతుండగా కర్నూలుకు వెళ్లే లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వారికి తీవ్రగాయాలయ్యాయి. వీరిని పాణ్యం సీహెచ్‌సీకి తరలించగా అప్పటికే శేషయ్య మృతిచెందాడు. చికిత్స అందిస్తుండగా సుబ్బయ్య చనిపోయాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని నంద్యాల ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్త తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 13: నంద్యాల పట్టణ శివార్లలోని ఆటో నగర్ జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మంగలి శ్రీనివాసులు (38) అక్కడి కక్కడే మృతి చెందాడు. వైఎస్ నగర్‌కు చెందిన మంగలి శ్రీనివాసులు సమీపంలోని శాంతిరాం జనరల్ ఆసుపత్రిలో బార్బర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం వైఎస్ నగర్ నుంచి శాంతిరాం ఆసుపత్రికి వెళుతుండగా ఆటోనగర్ వద్ద జాతీయ రహదారిపై ఓ ప్రైవేట్ విద్యా సంస్థ వాహనం ఢీ కొనడంతో మృతి చెందాడు. ఘటనా స్థలానికి ట్రాఫిక్ పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల సర్వజన వైద్యశాల మార్చురీ గదికి తరలించారు. మృతుడికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్త తెలిపారు.

టీచర్‌గా మారిన ఆర్డీవో



బోర్డుపై లెక్కలు రాస్తున్న ఆర్డీవో రామలక్ష్మి

పత్తికొండ, ఆగస్టు13 : డివిజనల్ రెవెన్యూ అధికారిగా నిత్యం బిజీబిజీగా ఉండే ఆర్డీవో రామలక్ష్మి మంగళవారం పత్తికొండ మండల పరిధిలోని జీవరాళ్లమల తండా(జెఎంతండా) గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. టీచర్‌గా మారి విద్యార్థులకు పాఠాలు చెప్పారు. ఓ విద్యార్థితో ఇంగ్లీషు పాఠం చదివించారు. మరో విద్యార్థినితో పాఠంలోని పదాలకు అర్థాలు అడిగారు. బోర్డు మీద లెక్కలు రాసి విద్యార్థులతో సమాధానం రాయించారు. ఏకోపాధ్యాయ పాఠశాల అయినప్పటికీ ఉపాధ్యాయురాలు కళ్యాణి విద్యార్థులకు చక్కగా చదువు చెబుతున్నారని అభినందించారు. కాగా వారం రోజుల క్రితం మరో ఉపాధ్యాయుడు నాగభూషణంను నియమించారని కళ్యాణి ఆర్డీవోకు వివరించారు. ఈ పాఠశాల ప్రభుత్వ పాఠశాలలకు పాఠశాల ఆదర్శం అని ఆర్డీవో అన్నారు.

స్కూలు బస్సుల ఆకస్మిక తనిఖీ

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 13: జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల బస్సులను, వ్యాన్‌లను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసినట్లు డీటీవో శివారెడ్డి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 8 వాహనాలపై కేసులు నమోదు చేశామన్నారు. పర్మిట్ లేకుండా తిరుగుతున్న వాహనాలను, పన్నులు చెల్లించని వాహనాలను గుర్తించినట్లు తెలిపారు. పన్ను రూపంలో రూ 12070, పెనాల్టీ రూపంలో 10800, సీఎఫ్ కింద రూ 54400 మొత్తం తనిఖీల్లో రూ77270 వసూలు చేసి ప్రభుత్వానికి చెల్లించినట్లు ఆయన తెలిపారు.

త్వరలో రెవెన్యూ సదస్సులు

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 13: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు త్వరలో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పి. రంజిత్ బాషా పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో రెవెన్యూ సదస్సుల నిర్వహణపై ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, రెవెన్యూ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ముఖ్యంగా భూ వివాద సమస్యలపై 70 నుంచి 80 శాతం అర్జీలు ప్రజల నుంచి వస్తున్నాయన్నారు. భూ సమస్యలను రెవెన్యూ సదస్సులలో గ్రామాల్లోనే పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు. పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు మాట్లాడుతూ గత ఐదేళ్ల కాలంలో పత్తికొండ మండలంలో దొంగ పాసు పుస్తకాలు ఆన్‌లైన్‌లో ఎక్కించుకోవడం లాంటి సంఘటనలు చాలా జరిగాయన్నారు. వీటిని పరిష్కరించేలా పత్తికొండ టౌన్‌లో రెవెన్యూ సదస్సు ఒకరోజు కాకుండా 3 నుంచి నాలుగు రోజులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. అలాగే ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ ఆదోనిలో కూడా భూముల కబ్జాలు చేయడం, డబుల్ రిజిస్ట్రేషన్లు లాంటి సమస్యలు చాలా ఎక్కువగా ఉన్నాయన్నారు. లేఅవుట్, మున్సిపాలిటీల్లో ఉన్న ఓపెన్ ల్యాండ్‌లను కూడా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, చెరువులను కూడా కబ్జా చేశారని, ఈ సమస్యలను పరిష్కరించేందుకు ఆదోని టౌన్‌లో 3 రోజులు రెవెన్యూ సదస్సులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణశర్మ, డీఆర్వో మధుసూదన్‌రావు, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, పత్తికొండ ఆర్డీఓ రామలక్ష్మి పాల్గొన్నారు.

పారా మెడికల్ కోర్సులకు గడువు పెంపు

కర్నూలు(హస్పిటల్), ఆగస్టు 13: పారా మెడికల్ కోర్సులకు దరఖాస్తు చేసుకునేందుకు విద్యార్థులకు ఈ నెల 19వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు కర్నూలు మెడికల్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ హరిచరణ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఏపీఎస్ఏహెచ్‌పీసీ ఇన్‌చార్జి అండ్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ నుంచి ఉత్తర్వులు అందాయన్నారు. దరఖాస్తులు www.appmb.co.in (or) appsahpc.co.in వెబ్‌సైట్‌లో ఈ నెల 18వ తేదీ వరకు లభించనున్నట్లు తెలిపారు. దరఖాస్తులు నెల 19వ తేదీ సాయంత్రం 5 గంటలోపు మెడికల్ కాలేజీలో అందజేయాలని కోరారు.

అయ్యో పాపం

- నీటి బకెట్‌లోపడి చిన్నారి మృతి
- వలస వెళ్లిన తల్లిదండ్రులకు తీరని శోకం



చిన్నారి గానవి (ఫైల్)

దేవనకొండ, ఆగస్టు 13 : పేదరికం, కరువు వల్ల తల్లిదండ్రులు వలస వెళ్లారు. ఇద్దరు చిన్నారులు నానమ్మ, మేనత్త పోషణలో ఉన్నారు. ఆడుకుంటూ ఉన్న చిన్నారి బాత్‌రూంలోని నీటి బకెట్‌లో పడి మృతి చెందింది. ఈ ఘటన మంగళవారం దేవనకొండ బీసీ కాలనీకి చెందిన ఎర్రగోటి మారెన్న, సుమలత దంపతులకు ఇద్దరు సంతానం. వీరితోపాటు ఇంట్లో మారెన్న తల్లి లక్ష్మమ్మ, అక్క మాదేవి ఉన్నారు. పేదరికం వల్ల ఇద్దరు చిన్నారులను నాయనమ్మ, మేనత్తల వద్ద వదిలి పెట్టి తెలంగాణలోని గద్వాల జిల్లాలో పత్తి పంట పనులకు మారెన్న దంపతులు వెళ్లారు. మంగళవారం మధ్యాహ్నం లక్ష్మమ్మ బయట బట్టలు ఉతుకుతుండగా, మాదేవి స్థానిక జెడ్పీ పాఠశాలలో మధ్యాహ్నభోజనం పనులు ముగించుకొనివచ్చింది. ఈలోగా చిన్నారి గానవి(3) ఆడుకుంటూ వెళ్లి బాత్‌రూంలోని నీటి బకెట్‌లో పడిపోయింది. మాదేవి వచ్చి చూసేసరికి పాప మృతి చెందింది. బతుకుతెరువు కోసం వలస వెళ్లిన తల్లిదండ్రులకు పాప మృతి తీరని శోకాన్ని మిగిల్చింది.

బొలేరో బోల్తా.. ముగ్గురికి తీవ్ర గాయాలు

తుగ్గలి, ఆగస్టు 13: జొన్నగిరి, రాంపురం, ఉప్పర్లపల్లి గ్రామాలకు చెందిన రైతులు సుధీర్, రంగస్వామి, రంగనాథ్ పచ్చిమిర్చి పంటను అమ్ముకుని తిరిగి వస్తుండగా.. బోలెరో వాహనం బోల్తా పడి ంది. ఈ ప్రమాదంలో ముగ్గురుకి తీవ్ర గాయాలయ్యాయి. సోమవారం అర్ధరాత్రి మండల పరిధిలోని ఉప్పర్లపల్లి గ్రామ సమీపంలోని రైల్వే ట్రాక్ పక్కన మలుపు వద్ద ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను గుత్తి వైద్యశాలకు తరలించి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలు వైద్యశాలకు తరలించారు.

అత్తింటి వేధింపులు..

ఆరుగురిపై కేసు నమోదు

కూడేరు, ఆగస్టు 13 : అనంతపురం జిల్లా కూడేరుకు చెందిన జ్ఞానిక అనే మహిళను వేధిస్తున్నట్లు ఫిర్యాదు రావడంతో ఆమె భర్తతోపాటు మరో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కూడేరుకు చెందిన జ్ఞానికకు కర్నూల్ జిల్లా తుగ్గలి మండలం ఆర్ఎస్ పెండెకల్లుకు చెందిన విజయ్‌తో ఈ ఏడాది మార్చిలో వివాహమైంది. వివాహమైన కొద్ది రోజులకు ఆమె గర్భం దాల్చింది. ఆమెను భర్త విజయ్‌తో పాటు అతడి తల్లి ప్రమీళ, తండ్రి గోపాల్, అన్న బ్రహ్మయ్య, వదిన బ్రాహ్మణి, అక్క పుణ్యవతి నిత్యం వేధింపులకు గురిచేశారు. అంతటితో ఆగకుండా తన అనుమతి లేకుండా గర్భం తొలగించారని జ్ఞానిక తల్లిదండ్రులకు తెలిపింది. ఈ మేరకు జ్ఞానిక, తల్లిదండ్రులు ఫిర్యాదు చేయగా... బాధితురాలి భర్తతో పాటు కుటుంబ సభ్యులు ఆరుగురిపై కేసునమోదు చేసినట్లు కూడేరు పోలీసులు తెలిపారు. ఇందులో భర్త విజయ్‌ని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఆరుగురు ఎస్‌ఐలు బదిలీ

కర్నూలు, ఆగస్టు 13: కర్నూలు డివిజన్ పరిధిలో ఆరుగురు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు వన్‌టౌన్‌లో పనిచేస్తున్న ఎస్.బాల నరసింహులును హొళగుందకు బదిలీ చేశారు. ఎమ్మిగనూరు టౌన్ యుపీఎస్ ఎస్ఐ రమేష్ బాబును కర్నూలు వన్‌టౌన్‌కు, వీఆర్‌లో ఉన్న కేపీ ప్రహ్లాదను ఆదోని పీసీఆర్‌కు, తిరుపతి వీఆర్‌లో ఉన్న ఎం.పరమేష్ నాయక్‌ను మంత్రాలయానికి బదిలీ చేశారు. అదేవిధంగా అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరులో వీఆర్‌లో ఉన్న హెచ్.డాక్టర్ నాయక్‌ను ఎమ్మిగనూరు పోలీస్ స్టేషన్‌కు, అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ ఎస్‌ఐ వి.శ్రీనివాసులును నందవరం పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

రైల్వే ట్రాక్‌మన్ ఆత్మహత్య

పెద్దకడుబూరు, ఆగస్టు13: రైల్వే ట్రాక్‌మెన్ ఉరివేసుకొని మృతి చెందాడు. ఈ సంఘటన సోమవారం చిన్నతుంబళం గ్రామం చెరువు సమీపంలో జరిగింది. పెద్దకడుబూరు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు గుంతకల్లుకు చెందిన శివలింగప్ప(57) రైల్వే ట్రాక్‌మన్‌గా పనిచేస్తున్నారు. విధుల్లో భాగంగా గుంతకల్లు నుంచి మంత్రాలయం వెళ్తున్నాడు. ఆదోని-మాధవరం రోడ్డులోని చిన్నతుంబళం గ్రామం వెలుపల చెరువు వద్ద రోడ్డుపై ఐచర్ వాహనంలో టాపు అంగులర్‌కు తాడుతో ఉరివేసుకున్నాడన్నారు. మృతుడి కుమారుడు లింగప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

చెత్తతో సంపద సృష్టించాలి

● కేంద్రాలను పరిశీలించిన అధికారులు ● రెండో రోజు కొనసాగిన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

గోస్పాడు, ఆగస్టు 13: గ్రామాల్లో చెత్త సేకరణ ద్వారా తడిచెత్తను, పొడిచెత్తను వేరు చేసి ఆ వ్యర్థాల నుంచి ఎరువులను తయారు చేసి సంపద సృష్టించుకోవాలని ఎంపీడీవో నాగ అనసూయ తెలిపారు. సర్పంచ్‌లకు, కార్యదర్శులకు జరుగుతున్న శిక్షణా తరగతులు మంగళవారంతో రెండో రోజుకు చేరుకున్నాయి. రెండో రోజు పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణపై క్షేత్రస్థాయి పర్యటన చేసి చెత్త సేకరణ కేంద్రాలను పరిశీలించారు. డీఎల్‌పీ రాంబాబు, యాళ్ళూరు మేజర్ పంచాయతీ ఈవో సుబ్బారావు, సర్పంచ్‌లు కాటంరెడ్డి సుధామణి, పరదేశి ప్రమీల, కార్యదర్శులు ప్రసాద్, ధనుంజయరెడ్డి, స్వర్ణ, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: గ్రామ పంచాయతీల్లోని చెత్తసేకరణ ద్వారా గ్రామాలు అభివృద్ధి చేసుకుందామని మండల పరిషత్ పరిపాలనాధికారి సుబ్రహ్మణ్యం పిలుపు నిచ్చారు. మంగళవారం గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలో భాగంగా రెండో రోజు కొత్తపల్లిలోని చెత్త సంపద కేంద్రాన్ని ఏవో సుబ్రహ్మణ్యం, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు క్లాప్ మిత్రలు సందర్శించారు.

మిడుతూరు: మిడుతూరు మండల పరిషత్ కార్యాలయం నందు సోమవారం నుంచి బుధవారం వరకు మూడు రోజులపాటు మండలంలోని సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శలకు గ్రామ పరిపాలన పట్ల శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఈవోఆర్డీ ఫకృద్దీన్ తెలిపారు. మంగళవారం శిక్షణలో భాగంగా స్వచ్ఛ సంకల్పం పట్ల సర్పంచులకు, కార్యదర్శలకు, పారిశుధ్య, కార్మికులకు అవగాహన కల్పించారు. క్షేత్రసాయిలో మిడుతూరు స్వచ్ఛసంకల్పం కేంద్రం దగ్గరకు వెళ్లి తడిచెత్త, పొడిచెత్త సేకరణ విధానం వాటి నుంచి వచ్చే వర్మీ కంపోస్టు తయారు చేసే విధానంపై అవగాహన కల్పించారు.

ఆత్మకూరు: గ్రామపంచాయతీల పాలనను మెరుగుపర్చుకుందామని ఈవోపీఆర్‌డీ మోహన్‌కుమార్ పేర్కొన్నారు. ఈమేరకు మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనం నందు మండలంలోని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ నిర్వహించారు. అలాగే కరివేన గ్రామంలో క్షేత్రపర్యటన నిర్వహించి గ్రామపంచాయతీల పాలనపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పారిశుధ్యం, వీధిదీపాల నిర్వహణ, తాగునీటి తదితర మౌలిక సదుపాయాల కల్పనపై సర్పంచ్‌లు అవగాహన పెంచుకోవాలని సూచించారు. అలాగే గ్రామాల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రత్యేకించి పంచాయతీ రాజ్ చట్టం గురించి తెలుసుకోవడమే కాకుండా గ్రామాలకు మంజూరయ్యే ఆనిధులను ఏవిధంగా వాడుకోవాలన్న విషయాలను తెలుసుకోవాలని చెప్పారు. శిక్షకులు బాలునాయక్, శివశంకర్, జగన్‌జీవన్‌లు వ్యవహరించారు.

మహానంది: గ్రామాల అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం మండలంలోని గ్రామ సర్పంచ్, పంచాయితీ కార్యదర్శులకు ఇస్తున్న శిక్షణలో భాగంగా మంగళవారం రెండో రోజు ఎం. తిమ్మాపురంలోని చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. జడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, ఈవోఆర్డీ శివనాగజ్యోతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్‌కుమార్, టీఓటీలు వెంకటయ్య, సుమంత్‌లతో పాటు క్లాప్ మిత్ర, షెడ్ మిత్రలు పాల్గొన్నారు.


కొత్తపల్లి: ఎరువు తయారీపై అవగాహన కల్పిస్తున్న ఏవో


మహానంది: ఎం.తిమ్మాపురంలో..

అక్రమాలను బయటపెడతాం

● టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చిన్న వెంకటస్వామి



మాట్లాడుతున్న కాకరవాడ చిన్న వెంకటస్వామి

నందికొట్కూరు, ఆగస్టు 13: కమ్యూనిజం ముసుగులో కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారని, ఆ అక్రమాలను బయటపెడతామని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ డా.కాకరవాడ చిన్న వెంకటస్వామి అన్నారు. నందికొట్కూరులోని బైరెడ్డి కాంప్లెక్స్‌లోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం కౌన్సిలర్, ఇతర టీడీపీ నాయకులతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. చిన్నవెంకటస్వామి మాట్లాడుతూ కమ్యూనిజం అన్నది మహోన్నతమైనదని, గొప్ప సిద్ధాంతాలు ఉండడం వల్లే ఇన్ని రోజులు నిలబడిందన్నారు. అలాంటి కమ్యూనిజానికి నందికొట్కూరులోని కొందరు నాయకులు మసిపూసే విధంగా ప్రవర్తిస్తున్నారన్నారు. రుక్మిణి పాండురంగస్వామి ఆలయంలో భూమి పూజ చేసేందుకు బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి వస్తే అడ్డుకోవడం వెనుక అంతర్యమేమిటో ప్రజలందరికీ తెలుసన్నారు. దేవదాయ భూములు, వక్ఫ్ భూములు, తదితర వాటి వివరాలపై సమాచార హక్కు చట్టం వేశామన్నారు. వివరాలు వచ్చాక కమ్యూనిజాన్ని అడ్డం పెట్టుకొని సంపాదించిన అక్రమ భూములను భయటపెడతామన్నారు. నందికొట్కూరు గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలోనే పాండురంగ స్వామి ఆలయ నిర్మాణం కోసం ఈ స్థలాన్ని కేటాయించిందని చెప్పారు. ఈ విషయంపై కలెక్టర్‌కు కూడా వివరణ ఇస్తామని ఆయన తెలిపారు. కౌన్సిలర్ చాంద్‌బాషా, టీడీపీ నాయకులు సత్యనారాయణ, శ్రీనివాసులు, అబ్దుల్ సుకూర్, సాయబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

'ఆలయ భూములను కాపాడుతాం'


మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు బీవీ సుబ్బారెడ్డి

నందికొట్కూరు, ఆగస్టు 13: నందికొట్కూరులో పాండురంగస్వామి దేవాలయానికి ఉన్న భూమిని చట్టప్రకారం ఆలయానికే చెందేలా కాపాడుతామని బీజేపీ నాయకుడు బీవీ సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం నందికొట్కూరు రుక్మిణి పాండురంగస్వామి ఆలయం ప్రాంగణంలో భక్తులతో బీజేపీ నాయకులు సమావేశం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దామోదర్‌రెడ్డి, నంద్యాల సెక్రటరీ గూడూరు రవికుమార్‌రెడ్డి, నాయకులు రామచంద్రుడు, రాజేశ్వరరెడ్డి, శ్రీకాంత్, సంజీవరెడ్డి, గోపాల్ అశ్విని కుమార్ తదితరులు పాల్గొన్నారు.

16న సామూహిక వరలక్ష్మీ వ్రతం

మహానంది, ఆగస్టు 13: శ్రావణ మాసం రెండో శుక్రవారం పురస్కరించుకొని ఈనెల 16న మహానంది క్షేత్రంలో సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహిస్తున్నట్లు ఆలయ వేదపండితులు రవిశంకర్ అవధాని మంగళవారం తెలిపారు. ఆలయం ప్రాంగణంలోని అభిషేక మంటపంలో అత్యంత వైభవంగా ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వందలాదిమంది మహిళల చేత సామూహిక వరలక్ష్మి వ్రతం జరుపుతామని చెప్పారు. దాతగా నంద్యాలకు చెందిన ఏజియన్ జ్యూవెలర్స్ అధినేత అవ్వారు గౌరినాథ్, సరస్వతి దంపతులు వ్యవహరిస్తారని వేదపండితులు తెలిపారు.

రహదారి గుంతలమయం


గుంతలమయంగా మారిన మద్దూరు-గుంతకందాల రోడ్డు

పాములపాడు, ఆగస్టు 13: మండల కేంద్రం నుంచి గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారులు గుంతల మయంగా మారి వర్షాలకు అధ్వానంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మద్దూరు నుంచి గుంతకందాలకు వెళ్లే రహదారి గుంతలు ఏర్పడటంతో నిత్యం ఈ రహదారి గుండా క్రిష్ణనగర్, మద్దూరు గ్రామస్థులు నిత్యావసర సరుకులు, రైతులు ఎరువులు కొనుగోలు చేసేందుకు, విద్యార్థులు కళాశాలకు వెలుగోడుకు వెళ్తుంటారు. రైతులు మ పంట పొలాలకు వ్యవసాయ సామగ్రి, మందు సంచులను తరలించడంతో ఇబ్బందులు పడుతున్నారు. అలాగే పాములపాడు నుంచి చెలిమిళ్ళ కంబాలపల్లి నుంచి ఇస్కాల గ్రామాలకు వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారులకు మరమ్మతులు గాని నూతన రహదారులు నిర్మించాలని ప్రజలు కోరుచున్నారు.

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

కొత్తపల్లి, ఆగస్టు 13: కొత్తపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా దాసరి మేరి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె గతంలో కొత్తపల్లి ఎంపీడీవోగా విధులు నిర్వహించారు. అయితే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అనంతపురం జిల్లా మడకశిరకు బదిలీపై వెళ్లారు. ఎన్నికల అనంతరం మళ్లీ ప్రభుత్వం గతంలో ఎక్కడ విధులు నిర్వహించారో అదే స్థానానికి బదిలీ చేయడంతో ఎట్టకేలకు ఎంపీడీవో మేరీ మళ్లీ తిరిగి బాధ్యతలు చేపట్టారు. మండల నాయకులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

తహసీల్దార్‌ను కలిసిన ప్రముఖులు

వెలుగోడు, ఆగస్టు 13: వెలుగోడు తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసగౌడ్‌ను మంగళవారం టీడీపీ నాయకులు, ఆర్యవైశ్య ప్రముఖులు కలిశారు. తహసీల్దార్‌కు శాలువా కప్పి పూలమాల వేసి సన్మానించారు. ప్రజలకు అందుబాటులో ఉండి మంచి సేవలందించాలని వారు కోరారు. సుబ్రహ్మణ్యం, రాము, సంజీవరాయ ప్రసాద్, శ్రీను, నాగరాజు పాల్గొన్నారు.

సారా పట్టివేత

వెలుగోడు, ఆగస్టు 13: వెలుగోడు మండలంలోని గుంతకందాల గ్రామ శివార్లలో ఓ వ్యక్తి నాటు సారా విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు ఎస్‌ఐ భూపాలుడు సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి 20 లీటర్ల నాటు సారా, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. సిబ్బంది సాషావలి మాధవరావు, సురేష్, రామ్‌నాయక్ ఉన్నారు.

'అక్రమ కేసును ఎత్తివేయాలి'

నంద్యాల (నూనెపల్లె),ఆగస్టు 13: బనగానపల్లెకు చెందిన పత్రికా విలేకరి, ఆయన కుమారుడిపై అక్రమంగా బనాయించిన కేసును ఎత్తి వేయాలని ఏపీయూడబ్ల్యూజే నాయకులు ఎస్పీని కోరారు. మంగళవారం ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్యాం సుందర్‌లాల్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు మధు, చలంబాబు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణాను కలిసి వినతి పత్రం అందజేశారు. జోహలాపురం గ్రామంలో ప్రభుత్వ స్థలాన్ని కొంత మంది అక్రమంగా కబ్జా చేసి ఇంటి నిర్మాణం చేపట్టగా ఆ ఘటనపై జిల్లా పంచాయతీ అధికారి, ఎంపీడీవోలు విచారణ చేపట్టిన విషయాన్ని వార్త పత్రికలలో ప్రచురితం అయిందన్నారు. కబ్జా చేసిన వ్యక్తులు విలేకరిపై అక్రమ కేసులు బనాయించారని ఎస్పీ దృష్టికి తీసుకు వచ్చారు.

అవయవ దానంపై అవగాహన సదస్సు

పాణ్యం, ఆగస్టు 13: మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ప్రపంచ అవయవ దాన దినోత్సవంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ సత్యప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో శాంతిరాం జనరల్ వైద్యశాల పథాలజీ ప్రొఫెసర్ డాక్టర్ జానకి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం దేశంలో 0.01 శాతం మంది మాత్రమే చనిపోయాక అవయవ దానం చేస్తున్నారన్నారు. ప్రజల్లో అవగాహన పెరగాలన్నారు. మరణంతో మూతబడే కళ్లు మరొకరికి చూపునిస్తాయన్నారు. మూత్ర పిండాలు, లివర్, ఊపిరితిత్తులు వంటివి మరొకరికి ప్రాణాపాయం నుంచి కాపాడతాయన్నారు. మూత్రపిండాలు పాడై యేటా రెండు లక్షల మంది చనిపోతూ ఉంటే 17 వేలకు మించి అవయవ దానాలు జరగడంలేదన్నారు. అవయవదానం చేసి మరోసారి జీవించాలని ఆమె కోరారు. హెచ్ఓడీలు నాగభాస్కరరెడ్డి, సురేష్‌కుమార్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

'నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు'


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

ఆత్మకూరురూరల్, ఆగస్టు 13: నులి పురుగులను పూర్తిగా నిర్మూలించి, రక్త హీనతను తగ్గించేందుకే ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నట్లు వైద్యాధికారి పవన్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని బైర్లూటి గూడెంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో ఈనెల 20న జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా పంపిణీ చేయనున్న ఆల్బెండజోల్ మాత్రల ఆవశ్యకత గురించి విద్యార్థినులకు వివరించారు.ఈ సందర్భంగా వైద్యాధికారి పవన్‌కుమార్ మాట్లాడుతూ.. 5 సంవత్సరాల నుంచి 19 సంవత్సరాల వరకు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఈ మాత్రలను తీసుకోవడం ద్వారా నులిపురుగుల నివారణతో పాటు, రక్తహీనతను అధిగమించి ఆరోగ్యవంతులుగా తీర్చి దిద్దేందుకే ప్రభుత్వం ఈ ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సరస్వతి, బాషా, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్య స్వామికి పూజలు

శ్రీశైలం, ఆగస్టు 13: శ్రీశైలం మహాక్షేత్రంలో మంగళవారం లోక కళ్యాణార్థం ఆలయ ప్రాంగణంలోని సుబ్రహ్మణ్య (కుమారస్వామి) స్వామికి, నందీశ్వర స్వామికి, బయలు వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో దేశం శాంతిసౌభాగ్యాలతో విరిసిల్లాలని అర్చకస్వాములు సంకల్పం పఠించారు, అనంతరం పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిస్వామికి పూజలు చేశారు. పంచామృతాలతో అభిషేకించి మంగళ హారతులు ఇచ్చారు.

గంగమ్మకు బోనాలు


అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

వెలుగోడు, ఆగస్టు 13: వెలుగోడు పట్టణంలోని చాకలిపేటకు చెందిన రజకులు మంగళవారం భక్తిశ్రద్ధలతో గంగమ్మకు పూజలు నిర్వహించారు. ఏటా జలాశయానికి నీరు చేరుకున్న తర్వాత పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. మహిళలు బోనాలతో ఊరేగింపుగా గ్రామ శివార్లలోని గాలేరు నది వద్దకు చేరుకున్నారు. అక్కడ గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక వంటకాలు చేసి సామూహిక వన భోజనాలు చేశారు.

స్కూల్ బస్సులు సీజ్

ఆత్మకూరు, ఆగస్టు 13: ఆత్మకూరు పట్టణంలో మంగళవారం రవాణాశాఖ అధికారులు స్కూల్ బస్సులపై ఆకస్మిక దాడులు చేపట్టారు. ఆత్మకూరు ఇన్‌చార్జి ఏఎంవీఐ సుబ్బయ్య పట్టణంలోని వలు పాఠశాలలకు చెందిన బస్సులను తనిఖీ చేశారు. ప్రత్యేకించి ఆయా బస్సులకు సంబంధించి ఫిట్‌నెస్, ట్యాక్స్, డ్రైవర్ల డ్రైవింగ్ లైసెన్స్ ఇతర ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. సరైన పత్రాలు, లైసెన్స్ లేని ఆదిత్యా స్కూల్‌కు చెందిన రెండు బస్సులను సీజ్ చేసి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్కూల్ బస్సుల యజమానులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

'ఓపెన్ ఇంటర్‌కు దరఖాస్తు చేసుకోండి'

ఆత్మకూరు, ఆగస్టు 13: ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఓపెన్ ఇంటర్ చదివేందుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రఘురామాచార్యులు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. తమ కళాశాల ద్వారా ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం నుంచి దూరవిద్య విధానంలో అడ్మిషన్లు పొందేందుకు అవకాశం ఉందని చెప్పారు. ప్రత్యేకించి ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ ఇంగ్లీష్/తెలుగు/ఉర్దూ మీడియం కోర్సులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఆసక్తి గల వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆర్జీఎం కళాశాలకు జాతీయ ర్యాంకు

పాణ్యం, ఆగస్టు 13: మినిస్ట్రీ ఆఫ్ హ్యూమన్ రీసోర్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండియా ప్రతి ఏటా ఇంజనీరింగ్ కళాశాలలకిచ్చే నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్స్ ర్యాంకింగ్ అవార్డుల జాబితాలో ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాల నమోదైనట్లు కళాశాల డీన్ డాక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 12వ తేదీన మినిస్ట్రీ ఆఫ్ హ్యూమన్ రీసోర్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండియా ప్రకటించిన నిర్ఫ్ ర్యాంకుల జాబితాలో 200 నుంచి 300 ర్యాంకుల జాబితాలో నమోదైనట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న 8876 ఇంజనీరింగ్ కళాశాలల్లోని 300 కళాశాలలను ప్రతి యేటా కేంద్రప్రభుత్వం ఎంహెచ్‌ఆర్‌డీ ఆధ్వర్యంలో కళాశాలల ప్రమాణాలను ఆధారంగా ర్యాంకులు ప్రకటిస్తారన్నారు. ఈర్యాంకుల్లో ఉత్తమ ప్రమాణాలు పాటించిన వాటికి ఈ ర్యాంకులు ప్రకటిస్తారన్నారు. ఈ ర్యాంకింగ్‌కు కృషి చేసిన అధ్యాపకులకు, సిబ్బందికి కళాశాల చైర్మన్ డాక్టర్ శాంతిరాముడు, ఎండీ శివరాంలు కృతజ్ఞతలు తెలిపారు.

'ప్రతి ఇంటిపై జెండా ఎగురవేయాలి'


నంద్యాలలో బైకు ర్యాలీని ప్రారంభిస్తున్న మధు

నంద్యాల (కల్చరల్), ఆగస్టు 13: ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని బీజేపీ జిల్లా కోఆర్డినేటర్ అభిరుచి మధు పిలుపునిచ్చారు. నంద్యాల పట్టణంలో ఎన్డీఏ కూటమి నాయకుల ఆధ్వర్యంలో "హర్ ఘర్ తిరంగా" బైక్ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయం నుంచి వివేకానంద విగ్రహం వరకు బైక్ ర్యాలీ చేపట్టారు.

పాణ్యం: భారతదేశానికి స్వాతంత్ర్యం తెచ్చామనే మాటకు మేము సంసిద్ధులం కాదని కూటమి నాయకుల్లన్నారు. హర్ ఘర్ తిరంగా యాత్ర సందర్భంగా మంగళవారం పాణ్యంలో కూటమి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పాణ్యం గ్రామ పురవీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. నాయకులు మద్దిలేటి మాట్లాడుతూ నేటికి స్వాతంత్ర్యం వచ్చి 77 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా హర్ ఘర్ తిరంగా యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి'


మాట్లాడుతున్న పీఆర్‌టీయూ నాయకులు

గోస్పాడు, ఆగస్టు 13: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని పీఆర్‌టీయూ నాయకులు కృష్ణారావు, విజయరావు డిమాండ్ చేశారు. మంగళవారం గోస్పాడులో మాట్లాడుతూ జీవో నంబరు 117 రద్దు చేయాలని, సర్దుబాటు 2020లో జీవో నంబరు 53 ప్రకారం చేయాలని, 70 శాతం అంగవైకల్యం కలిగిన వారిని సర్దుబాటు నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. నెలవారి పదోన్నతులు కల్పించాలని, జీవో నంబరు 60 మేరకు ప్రాథమికోన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్లను నియమించాలని అన్నారు. పదోన్నతులు చేపట్టిన తరువాతే సర్దుబాటు చేయాలని అన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయు నాయకులు షెడ్రక్‌బాబు, శ్రీనివాసులు, ఫరూక్, అహమ్మద్, రాజశేఖర్‌రెడ్డి, సికిందర్, తదితరులు పాల్గొన్నారు.

'డ్రగ్స్ రహిత సమాజానికి కృషి చేద్దాం'

ఆత్మకూరు, ఆగస్టు 13: డ్రగ్స్ రహిత సమాజానికి కృషి చేద్దామని ఆత్మకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పద్మావతీబాయి పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాల గురించి మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పొగాకు, గంజాయి తదితర మత్తు పదార్థాల వల్ల తీవ్ర దుష్ఫలితాలు ఉంటాయన్నారు. మాదక ద్రవ్యాలు వినియోగించేవారిలో యువత ఎక్కువగా ఉన్నారని, దీనివల్ల యువత భవిష్యత్తు అంధకారం తయారవుతోందని అన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి డ్రగ్స్ నిర్మూలన కోసం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు కృష్ణ, విద్యాసాగర్, రామకృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు


నృత్యం చేస్తున్న కళాకారులు

శ్రీశైలం, ఆగస్టు 13: శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో మంగళవారం కడప జిల్లాకు చెందిన సాయి నటరాజ డాన్స్ అకాడమీ నృత్య అకాడమీ బృందంతో కూచిపూడి నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మహాగణపతిం, శంకర శశి వదన, కాలభైరవాష్టకం తదితర గీతాలకు మనస్విత, సిరి నందన్ రెడ్డి, చరణ్, శ్రీనివాస్ ధీరజ్, క్రాంతి కుమార్, తిరుపతి నృత్య ప్రదర్శనతో అలరించారు.

జూదరుల అరెస్టు

ఆత్మకూరు, ఆగస్టు 13: ఆత్మకూరు పట్టణ శివార్లలోని విద్యుత్ కార్యాలయం సమీపంలో సోమవారం రాత్రి పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ వెంకటనారాయణరెడ్డి మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ కార్యాలయం వెనక భాగాన బహిరంగ ప్రదేశంలో ఏడుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో తమ సిబ్బందితో కలిసి దాడులు చేపట్టినట్లు తెలిపారు. ఈదాడుల్లో ఆరుగురిని అరెస్టు చేయగా ఒకరు తప్పించుకున్నట్లు తెలిపారు. ఆదేవిధంగా వారి వద్ద నుంచి రూ.30,810 నగదుతో పాటు పేకముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

హత్యకు గంజాయే కారణమా ?

● తుపాకుల కోసం గాలింపు

పాణ్యం, ఆగసు 13: ఈనెల 11న పాణ్యం సమీపంలో జరిగిన హత్యకు గంజాయే కారణమని తెలుస్తోంది. హతుడు గంజాయికోసం గుంతకల్లు నుంచి వచ్చినట్లు తెలిసింది. గుంతకల్లు నుంచి దాదాపు ఐదుగురు నంద్యాలకు ఈ నెల 11వ తేదీన వచ్చినట్లు సమాచారం. కాగా గంజాయి నంద్యాలలో సరైన సమయానికి వీరికి అందకపోవడంతో ముగ్గురు పాణ్యానికి వచ్చినట్లు సమాచారం. సుగాలిమెట్టలో మద్యం తీసుకొని పాణ్యం సమీపంలోని తాటికాయ చెరువు ఆంజనేయస్వామి ఆలయం సమీపంలలో ఎస్సార్బీసీ కెనాల్ వద్ద మద్యం తాగినట్లు సమాచారం. మద్యం మత్తులో వీరి మధ్య వివాదం చోటు చేసుకోవడంతో తమ వద్ద ఉన్న తుపాకీతో కాల్చి చంపి తుపాకీలను సమీప కెనాల్‌లో వేసినట్లు సమాచారం. కాగా ఈ మేరకు మంగళవారం పోలీసులు గజ ఈతగాళ్లతో కెనాల్‌లో గాలించగా తుపాకులు దొరికినట్లు సమాచారం. నిందితులు కోసం తీవ్రంగా గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిసింది. కాగా గంజాయిని నంద్యాల నుంచి గత కొంత కాలంగా గుంతకల్లుకు వీరు గంజాయి, గుట్కా తదితర మత్తు పదార్థాలను సరఫరా చేస్తున్నట్లు సమాచారం.

మరో గేటు ఎత్తివేత

వెలుగోడు, ఆగస్టు 13: తెలుగంగలో అంతర్భాగమైన వెలుగోడు జలాశయం స్పిల్ వేకు చెందిన మరో గేటును గంగ అదికారులు ఎత్తి వేశారు.ఇప్పటికే ఒక గేటు ద్వారా విడుదల చేస్తూ రెండవ గేటు ఎత్తడంతో గాలేరు నదిలో నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. జలాశయంలోకి బాన కచెర్ల సముదాయం నుంచి నీటి ప్రవాహం కొనసాగుతూనే ఉంది.జలాశయంలోకి 8100 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. జలాశయం నుంచి స్పిల్ వేకు చెందిన రెండు గేట్ల ద్వారా 5000 క్యూసెక్కులు, మెయిన్ కెనాల్ ద్వారా 5 వేలు,వన్‌ఆర్ ద్వారా 50, వన్‌ఎల్ ద్వారా 30 నంద్యాల త్రాగునీట ఇపథకానికి 15 క్యూసెక్కుల చొప్పున దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 263.11 మీటర్ల వద్ద 14.316 టీఎంసీల నీరు నిలువ ఉంది.

'దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం ఇవ్వాలి'


ఏడీఏకు వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

ఆత్మకూరు, ఆగస్టు 13: ఆత్మకూరు ప్రాంతంలో అధిక వర్షాల ధాటికి దెబ్బతిన్న పంటలకు సంబంధించి బాధిత రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్ పేర్కొన్నారు మంగళవారం స్థానిక వ్యవసాయ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి వారు ధర్నా చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఆత్మకూరు డివిజన్ పరిధిలోని ఆత్మకూరు, పాములపాడు, కొత్తపల్లి, వెలుగోడు మండలాల్లో అధిక వర్షాలతో మొక్కజొన్న, వరి పంటలు దెబ్బతిని రైతులు నష్టపోయారని అన్నారు. గత మూడేళ్లుగా అతివృష్టి, అనావృష్టి కారణాలతో రైతులు నష్టపోతున్నట్లు వివరించారు. ఈనేపథ్యంలో బాధిత రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ.25 వేలు పరిహారం చెల్లించి ఆదుకోవాలని అన్నారు. అనంతరం ఏడీఏ ఆంజనేయకు వినతిపత్రాన్ని అందజేశారు. వివిధ సంఘాల నాయకులు వీరన్న, స్వాములు, సురేంద్ర, ఆదినారాయణ, టపాల్ అష్రఫ్ అలి, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

'సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవాలి'


సుంకేసుల గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న డీఎస్పీ

మిడుతూరు, ఆగస్టు 13: జలకనూరు మద్దిగుండం చెరువు నీటి సమస్యపై శాంతియుతంగా పరిస్కరించుకోవడానికి ఇరు గ్రామాల రైతులు సహరించాలని ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ అన్నారు. మంగళవారం సుంకేసుల, జలకనూరు గ్రామాల రైతులతో సమావేశం ఎస్‌ఐ జగన్‌మోహన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈసమావేశానికి ఆత్మకూరు డీఎస్పీ రామాంజనాయక్, నందికొట్కూరు రూరల్ సీఐ బీఆర్ కృష్ణయ్య హాజరయ్యారు. డీఎస్పీ మాట్లాడుతూ మద్దిగుండం చెరువు నీటి విషయంపై రైతులు ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోకూడదన్నారు. ఇరుగ్రామాల రైతులకు మధ్యవర్తులుగా పోలీసువారు అధికారులు, నాయకులతో మాట్లాడి సమస్యను పరిస్కరించుకుందామని రైతులకు సూచిం చారు. అలా కాకుండా ఎవరైనా చట్టాన్ని అతిక్రమించి గొడవలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామి ఆయన హెచ్చరించారు. సమావేశంలో సుంకేసుల, జలకనూరు గ్రామాల రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

'ఎల్ఐసీ ప్రీమియంపై జీఎస్టీని తొలగించాలి'

ఆత్మకూరురూరల్, ఆగస్టు 13: ఎల్ఐసీకి వినియోగదారులు చెల్లించే ప్రీమియంలపై కేంద్ర ప్రభుత్వం విధిస్తున్న జీఎస్టీని తొలగించాలని చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్ వెల్ఫేర్ అసోసియేషన్ డివిజన్ జాయింట్ సెక్రటరీ పి.అబ్దుల్ కరీం డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయంలో మంగళవారం ఆ అసోసియేషన్ 13 వేడుకల సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ పాండురంగ నాయక్ ఆధ్వర్యంలో క్లియా ఏజంట్లు కేక్ కట్ చేశారు. అబ్దుల్ కరీం మాట్లాడుతూ క్లియాలకు గౌరవ వేతనంతో పాటు, గ్రూప్ ఇన్సూరెన్స్ మెడి క్లెయిం, ఏజంట్ల కుటుంబ సభ్యులతో సహా అందించాలని కోరారు. ఎల్ఐసీ పబ్లిక్ సెక్టార్‌ను బలోపేతం చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో క్లియాలు వరాల రహంతుల్లా కొండయ్య, రాంబాబు, లియాఫి డివిజన్ ఉపాధ్యక్షులు లక్ష్మిరెడ్డి, లియాఫి అధ్యక్షుడు స్వామిదాసు, ఆత్మకూరు, నందికొట్కూరు ఎల్ఐసీ ఏజంట్లు లు పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన టీడీపీ నాయకులు

గడివేముల, ఆగస్టు 13: తహసీల్దార్ బీవీఎన్ విద్యాసాగర్‌ను మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో టీడీపీ మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాసరెడ్డి తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం మండలంలోని రెవెన్యూ సమస్యలను వివరించారు. ప్రజలకు అందుబాటులో ఉండి రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



ముత్యాలపాడులో రైతులతో మాట్లాడుతున్న జిల్లా అధికారులు

చాగలమర్రి, ఆగస్టు 13: ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ తెలిపారు. మంగళవారం మండలంలోని చక్రవర్తులపల్లె గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించే రైతు జయరామిరెడ్డి సాగు చేసిన మొక్కజొన్న, వరి, నిమ్మ తోటలను పరిశీలించారు. రైతు పాటించే ప్రకృతి వ్యవసాయ పద్ధతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంటలు పండించడం వల్ల తక్కువ ఖర్చుతో అధిక లాభాలు వస్తాయని అన్నారు. ఖరీఫ్ పంట నమోదులో ఎదురయ్యే ఇబ్బందుల గురించి వ్యవసాయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రతి పంటను తప్పనిసరిగా నమోదు చేయించాలన్నారు. ఆయన వెంట జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం డీపీఎం నరేంద్రారెడ్డి, ఏవో రంగనేతాజీ, ఏఈవో అస్రఫ్, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా బసవేశ్వర స్వామి గ్రామోత్సవం



స్వామివారికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు, అర్చకులు

ఉయ్యాలవాడ, ఆగస్టు 13: బసవేశ్వరస్వామి ప్రతిష్ఠోత్సవంలో భాగంగా మంగళవారం మేళ, తాళాల మధ్య స్వామి వారికి సూరావారి వంశస్థుల ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించారు. అర్చకులు జగన్ మోహన్‌శర్మ, రాజుశర్మ, మోహనయ్య, కమలేశ్వరశర్మ, భాష్కర్‌శర్మలు స్వామి వారికి కలశస్థాపన, మటంపారాధన, వాస్తు, నవగ్రహ, గణపతి హోమం చేశారు. బుధవారం ఉదయం విగ్రహ ప్రతిష్ఠ నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. విచ్చేసిన భక్తులకు తీర్థ, ప్రసాదాలు పంచి పెట్టారు.

మొక్కల పెంపకం అందరి బాధ్యత



మొక్కలను పంపిణీ చేస్తున్న ప్రకృతి వ్యవసాయ అధికారులు

ప్యాపిలి, ఆగస్టు 13: మొక్కల పెంపకం అందరి బాధ్యతగా భావించాలని ప్రకృతి వ్యవసాయశాఖ జిల్లా అదనపు అధికారి అబ్దుల్ సలాం అన్నారు. సేవ్‌ట్రీస్, ఇంపాక్ట్ క్యాట్ లిస్ట్ ఫౌండేషన్, ప్రకృతి వ్యవసాయశాఖ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని జలదుర్గం గ్రామంలో రైతులకు కొబ్బరి, జామ, మామిడి తదితర మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అబ్దుల్ సలాం మాట్లాడుతూ రైతులు విరివిగా పండ్ల తోటలను సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ నరసింహ, మద్దయ్య, జమాల్‌బాషా, సుధాకర్‌నాయుడు, దస్తగిరి పాల్గొన్నారు.

'ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాలు సురక్షితం'

దొర్నిపాడు, ఆగస్టు 13: ప్రభుత్వ వైద్యశాలలో ప్రసవాలు సురక్షితమని వైద్యాధికారి నాగేంద్ర అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలో ప్రైవేటు వైద్యశాలల కంటే మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. వేలాది రూపాయలు ఖర్చు లేకుండా ప్రభుత్వ వైద్యశాలలో ప్రసవాలు జరిగిన మహిళకు రూ.5 వేలు వారి అకౌంట్ ఖాతాలో జమ అవుతుందని చెప్పారు. తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. స్టాఫ్ నర్స్ శారద, మానస పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన టీడీపీ నాయకులు

డోన్, ఆగస్టు 13: డోన్ నూతన తహసీల్దార్ నాగమణిని మంగళవారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్ మర్యాద పూర్వకంగా కలిశారు. అదేవిధంగా కమలాపురం సర్పంచ్ రేగటి అర్జున్‌రెడ్డి తహసీల్దార్‌ను కలిసి పూలబొకేను అందజేశారు.

ప్రజాసంఘాల నాయకులపై బైరెడ్డి దౌర్జన్యం తగదు

బేతంచెర్ల, ఆగస్టు 13: నందికొట్కూరు పట్టణంలో ప్రజా సంఘాల నాయకులపై మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి దౌర్జన్యానికి దిగడం తగదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య అన్నారు. మంగళవారం మండలంలో రంగాపురం గ్రామంలో ప్రజా సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎల్లయ్య మాట్లాడుతూ కార్మికులకు న్యాయం చేయాలని ప్రజా సంఘాల నాయకులు బైరెడ్డికి వినతి పత్రం ఇవ్వడానికి వెళితే వినతి పత్రానికి సమాధానం ఇవ్వాల్సింది పోయి ప్రజా సంఘాల నాయకులను బెదిరించడం సరికాదన్నారు. సమావేశంలో సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్.రహంతుల్లా, నాయకురాలు షేబారాణి, ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు, చిన్నా పాల్గొన్నారు.

గ్రంథాలయ పన్ను చెల్లించాలి

బనగానపల్లె, ఆగస్టు 13: పంచాయతీలు గ్రంథాలయ పన్ను తప్పనిసరిగా చెల్లించాలని బనగాపల్లె గ్రంథాలయాధికారి బషీర్‌అహ్మద్ అన్నారు. మంగళవారం మండలంలోని పాతపాడు పంచాయతీ కార్యాలయంలో మండల అభివృద్ధి అధికారి నాగరాజు అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శుల సమావేశాన్ని నిర్వహించారు. బషీర్ అహ్మద్ మాట్లాడుతూ ఏళ్ల తరబడి గ్రంథాలయ పన్ను చెల్లించకుండా ఉండటం తగదన్నారు.

'విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి'



క్రీడలను ప్రారంభిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాసరావు

దొర్నిపాడు, ఆగస్టు 13: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం దొర్నిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈనెల 15న స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు దేవేంద్ర, ఉపాధ్యాయులు ఉన్నారు.

సంపద సృష్టి జరిగేనా ?

- గత వైసీపీ హయాంలో చెత్త సంపద కేంద్రాలకు చెదలు
- కూటమి ప్రభుత్వం రాకతో ఆశలు



కొలిమిగుండ్లలో నిరుపయోగంగా చెత్త సంపద కేంద్రం

కొలిమిగుండ్ల, ఆగస్టు 13: కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన చెత్త సంపద కేంద్రాలకు గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా చెదలు పట్టింది. స్వచ్ఛ భారత్ స్ఫూర్తితో చెత్త నుంచి సంపద సృష్టించడానికి 2014-19 మధ్య కాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఊరూరా వర్మీకంపోస్టు యూనిట్లు నిర్మించింది. అయితే గత వైసీపీ ప్రభుత్వం చెత్త పన్ను విధించడంలో కనబరచిన ఆసక్తిని చెత్తను సేకరించి, సంపద సృష్టించడంలో చూపలేదు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన చెత్త సంపద కేంద్రాలు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. ప్రజలకు చెత్త కష్టాలు తప్పడంలేదు. కొలిమిగుండ్ల మండల కేంద్రంలో గ్రామానికి దూరంగా డంపింగ్ యార్డు కేంద్రాన్ని నిర్మించడం, పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో చెత్త సేకరణ జరడం లేదు. దీంతో పట్టణ ప్రజలు తమ ఇళ్లలో లభించే చెత్తను కాలువల్లో, ప్రధాన రహదారుల పక్కన పడేస్తుండడంతో ఎటు చూసినా మురికి కూపాలు దర్శనమిస్తున్నాయి. ఫలితంగా చెత్త సంపద కేంద్రాలకు చెత్త వెళ్లడం లేదు. దీంతో అవి నిరుప యోగంగా మారి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. కొలిమిగుండ్లతోపాటు మండలంలోని మీర్జాపురం, పేట్నికోట, ఇటిక్యాల, అంకిరెడ్డిపల్లె, బెలుం, చింతలాయపల్లె తదితర సుమారు 22గ్రామాల్లో కోట్లు వెచ్చించి నిర్మించిన చెత్త సంపద కేంద్రాలు నిరుపయోగంగా మారాయి.

కూటమి ప్రభుత్వం అధికారంతో ఆశలు: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో చెత్త సంపద సృష్టిపై ఆశలు రెకెత్తుతున్నాయి. ఇప్పటికే చెత్త సంపద కేంద్రాలపై దృష్టి సారించి, సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి







డోన్‌లో జాతీయ జెండాలతో బీజేపీ నాయకులు, బనగానపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, కోవెలకుంట్లలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

డోన్, ఆగస్టు 13: ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి జాతీయ ఐక్యతను చాటుదామని బీజేపీ డోన్ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్డె మహారాజ్ పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు మంగళవారం పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా నినాదంతో స్వామి వివేకానంద విగ్రహం వద్ద నుంచి పాతబస్టాండు గాంధీ విగ్రహం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయ కులు సంధు వెంకటరమణ, ఆర్మీ రామయ్య, కేసీ మద్దిలేటి, అవుకు వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు సంధు రాజశేఖర్, మండల అధ్యక్షుడు బొంకూరి రవికుమార్, ప్యాపిలి మండల అధ్యక్షుడు దామోదర్ నాయుడు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: పట్టణంలోని వాసవీ బొమ్మిడాల డిగ్రీ కళాశాలలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసరు రామ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ కె.వేణుగోపాల్ మాట్లాడుతూ విద్యార్థులు స్వాతంత్ర్య దినోత్సవం గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బనగానపల్లె: ప్రతి ఒక్కరూ దేశ ఔన్నత్యాన్ని చాటి చెప్పాలని బనగానపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బాబునాథ్ అన్నారు. మంగళవారం ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ కౌసల్యదేవి ఆధ్వర్యంలో విద్యార్థులు త్రివర్ణ పతాకం ప్రాధాన్యతను తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వసుంధర, సూర్యనారాయణరెడ్డి, వరలక్ష్మీ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ చౌక దుకాణాల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న డోన్ సీఎస్‌డీటీ రబ్బాని

బేతంచెర్ల, ఆగస్టు 13: కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణంలోని ప్రభుత్వ చౌక దుకాణాలను డోన్ సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ రబ్బాని మంగళవారం తనిఖీ చేసి, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. డీలర్లు ప్రజా పంపిణీలో ఎలాంటి అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఆర్ఐ శ్రీదేవి, సిబ్బంది డీలర్లు ఉన్నారు.

ఇంటర్ విద్య ఎంతో కీలకం: ఎంఈవో

కొలిమిగుండ్ల, ఆగస్టు 13: విద్యార్థులకు ఇంటర్ మీడియట్ దశ ఎంతో కీలకమని ఎంఈవో రాజయ్య అన్నారు. మంగళవారం కొలిమిగుండ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు అధ్యక్షతన విద్యార్థులు ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈవో రాజయ్య, ప్రిన్సిపాల్ శ్రీనివాసులు ఇంటర్ విద్యార్థులు చెడు మార్గాన్ని అనుసరించకుండా, మంచి నిర్ణయాలతో భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవాలని సూచించారు. అనంతరం ఫైనల్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన 8మంది విద్యార్థులకు అధ్యాపకులు రూ.3వేలు ప్రోత్సాహక నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి, రామక్రిష్ణ, ఓబయ్య, బాల ఓబన్న పాల్గొన్నారు.

విద్యార్థులు జాతీయ భావం పెంచుకోవాలి

కొలిమిగుండ్ల, ఆగస్టు 13: విద్యార్థులు చిన్నతనం నుంచే జాతీయ భావం పెంచుకోవాలని రామ్‌కో సిమెంట్ వైస్ పెసిడెంట్ సూర్యకాంత్ అన్నారు. మంగళవారం రామ్‌కో యూనిట్‌హెడ్ రెడ్డి నాగరాజు ఆధ్వర్యంలో అంతరిక్ష వారోత్సవాన్ని కొలిమిగుండ్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఆగస్టు-23న చంద్రయాన్-3 చంద్రుడి దక్షణ ధృవంపై దిగిందని, ఈవిజయానికి గుర్తుగా ఈవేడుకలు నిర్వహిస్తారని రామ్‌కో ప్రెసిడెంట్ సూర్యకాంత్, మైన్స్ జీఎం అజ్మల్ అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం హుసేనయ్య, రామ్‌కో సతీష్, నరేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

చాగలమర్రి, ఆగస్టు 13: చాగలమర్రి సంతమార్కెట్ సమీపంలోని ప్రధాన ప్రాథమిక పాఠశాలను ఎంఈవో అనూరాధ, గిరిజన కాలనీలోగల ప్రాథమిక పాఠశాలను ఎంఈవో న్యామతుల్ల తనిఖీ చేశారు. రికార్డులను, విద్యార్థుల గ్రేడింగ్‌ను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. హెచ్‌ఎంలు నారాయణరెడ్డి, శేషాద్రి, సీఆర్పీ అమీర్‌ఖాన్ ఉన్నారు.

'సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలి'

చాగలమర్రి, ఆగస్టు 13: మండలంలో ఉపాధ్యాయ సంఘాల సమన్వయ కమిటీలను ఏర్పాటు చేయాలని జిల్లా యూటీఎఫ్ అధ్యక్షుడు ప్రసాద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఐజయ్య పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఆయా పాఠశాలల్లో యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎంఈవోకు వినతి పత్రం అందజేశారు. ఎమ్మార్సీ కార్యాలయంలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. జిల్లా ఆర్థిక కార్యదర్శి బాబా పక్రుద్దీన్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు డెన్ని జాన్సన్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి మృతి బాధాకరం

కొలిమిగుండ్ల, ఆగస్టు 13: ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు ఆకస్మిక మృతి బాధాకరమని కోటపాడు టీడీపీ నాయకులు శివరామిరెడ్డి, కల్లూరి సూరి, వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం కోటపాడు గ్రామం ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం ప్రసాద్ ఆధ్వర్యంలో ఆయనకు ఘనం గా నివాళి అర్పించారు. కార్యక్రమంలో రామగోపాల్ ఎర్రక్క, ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ పరిశీలన

ఆళ్లగడ్డ, ఆగస్టు 12: ఆళ్లగడ్డ పట్టణంలో అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే అఖిలప్రియ మంగళవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రారంభోత్సవాన్ని వచ్చే నెల సెప్టెంబరు 1వ తేదికి వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. 100 మున్సిపాలిటీలలో అన్న క్యాంటీన్ల ప్రారంభోత్సవాలు అనివార్య కారణాల వల్ల వాయిదా పడినట్లు తెలిపారు. ఆమె వెంట కమిషనర్ రమేష్ బాబు, కౌన్సిలర్ హుసేన్‌బాషా తదితరులు ఉన్నారు.

జీవో నెంబరు 117 రద్దు చేయాలి

రుద్రవరం, ఆగస్టు 13 : జీవో నెంబరు 117 రద్దు చేయాలని ఏపీయూఎస్ జిల్లా ఆర్థిక కార్యదర్శి శ్రీపతి, జిల్లా కార్యవర్గసభ్యుడు మల్లికార్జునరాజు డిమాండ్ చేశారు. మంగళవారం సభ్యత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్కూలు గ్రాంటు గత రెండు సంవత్సరాల నుంచి మంజూరు కావడం లేదు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండల ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, తాలుకా కార్యదర్శి తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి: ఏడీఏ



పంట నమోదును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

డోన్(రూరల్), ఆగస్టు 13: రైతులు పంట నమోదును తప్పని సరిగా చేయించుకోవాలని డోన్ వ్యవసాయ ఏడీఏ అశోక్‌వర్ధన్ రెడ్డి, మండల వ్యవసాయ శాఖ అధికారి అబ్దుల్ షఫీ సూచించారు. మంగళవారం ఉడుములపాడు గ్రామ పరిసరాల్లోని పొలాల్లో పంట నమోదు కార్యక్ర మాన్ని పరిశీలించారు. తప్పులు లేకుండా గ్రామ అధికారి ద్వారా పంట నమోదు చేయించుకోవాలన్నారు.

బేతంచెర్ల: మండలంలోని గ్రామాల్లోని రైతులు ఈ ఏడాది ఖరీఫ్‌లో పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి కిరణ్ కుమార్ రైతులకు సూచించారు. మంగళవారం బేతంచెర్ల పొలాల్లో రైతులకు పంట నమోదు కార్యక్రమం నిర్వహించారు. అసిస్టెంట్ సాజియా, బుగ్గానిపల్లెలో రవి తేజ ఆయా పొలాలకు వెళ్లి పంట నమోదు చేశారు.

తహసీల్దార్‌కు సన్మానం

కోవెలకుంట్ల, ఆగస్టు 13: కోవెలకుంట్ల తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డిని మంగళవారం డీలర్ల సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. నూతన తహసీల్దారుగా పవన్‌కుమార్‌రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. విషయం తెలుసుకున్న డీలర్లు, టీడీపీ నాయకుడు వల్లంపాడు సర్పంచ్ గార్లపాటి జగదీశ్వర్‌రెడ్డి, వెలగటూరు ధనుంజయయుడు తహసీ ల్దార్‌ను శాలువా కప్పి సన్మానించారు. ఈసందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ డీలర్ల కు న్యాయం జరిగేందుకు కృషి చేస్తామన్నారు. ఆర్ఐ ఇమ్రాన్, డీలర్లసంఘం నాయకులు పుల్లారెడ్డి, సుధాకర్‌రెడ్డి, విశ్వనాథం పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: కొలిమిగుండ్ల నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన బాలీశ్వరరెడ్డిని మండల డీలర్ల సంఘం నాయ కులు మంగళవారం సన్మానించారు. నాయకులు చెన్నారెడ్డి, వెంకటరా మిరెడ్డి తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భం గా ప్రజా పంపిణీ వ్యవస్థలో ఎటువంటి అక్రమాలకు తావులేకుండా చూడాలని తహసీల్దార్ డీలర్లకు సూచించారు. కార్యక్రమంలో వీఆర్వోలు ప్రసాదరెడ్డి, భార్గవి పాల్గొన్నారు.

కౌలుకార్డులు తీసుకోండి

కోవెలకుంట్ల, ఆగస్టు 13: భూములను కౌలుకు తీసుకుని పంటలు సాగు చేసే ప్రతి రైతు తప్పనిసరిగా కౌలు కార్డులు పొందాలని మండల వ్యవసాయాధికారి నిరంజన్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని వ్యవసాయ కార్యాలయంలో విలేకరులతో మాట్లా డుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతులు కౌలుకు తీసుకున్న భూ యజమానులను ఒప్పించి కౌలుకార్డులు పొందాలన్నారు. కౌలుకార్డు పొందితే ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీ విత్తనాలు, పంట రుణాలు పొందేందుకు వీలవుతుందన్నారు.

శుద్ధనీరు సరఫరా

ప్యాపిలి, ఆగస్టు 13: మండలంలోని ఊటకొండ గ్రామంలో గత వారం రోజులుగా శుద్ధనీరు సరఫరా చేస్తున్నారు. గత నెల 24న ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'నిరుపయో గంగా శుద్ధజల ప్లాంట్' అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు ప్లాంట్‌కు మరమ్మతులు చేసి శుద్ధజలం సరఫరా చేస్తున్నారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గొర్రెల చోరీ - రూ.3 లక్షలు నష్టం

కొలిమిగుండ్ల, ఆగస్టు 13: కొలిమిగుండ్లలోని రాజనేని మధుసూదన యాదవ్ అనే వ్యక్తి గొర్రెలను దొంగలు ఎత్తుకెళ్లారు. 300కు పైగా ఉన్న గొర్రెల మంద వద్ద తమ కుటుంబ సభ్యులను ఉంచి, గత శనివారం 10వ తేదీన బంధువుల పెళ్లికి మధుసూదనయాదవ్ వెళ్లాడు. మంగళవారం గొర్రెల మందను లెక్కించగా 26గొర్రెలు చోరీకి గురైనట్లు గుర్తించానని వాపోయాడు. వీటి విలువ సుమారు రూ.3లక్షలకు పైబడి ఉంటుంది. శనివారం రాత్రి వర్షం పడుతున్న సమయంలో కాపరులు గుడిసెలోకి వెళ్లారని, ఆ సమయంలోనే దొంగతనం జరిగి ఉండచ్చని అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

ఉయ్యాలవాడ, ఆగస్టు 13: మండలంలోని కొండుపల్లె గ్రామానికి చెందిన సిద్ధంరెడ్డి యశ్వంత్‌రెడ్డికి ఉద్యోగం ఇప్పిస్తానని అనంతపురం జిల్లా రాయదర్గుం మండలం జంజురామ గ్రామానికి చెందిన కృష్ణకాంత్ రూ.2.60 లక్షలు తీసుకున్నాడని ఎస్ఐ రామాంజనేయరెడ్డి మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ బి.టెక్ చదివిన తనకు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని 2023 మార్చిలో తన వద్ద నుంచి రూ. 2.60 లక్షలు తీసుకున్నాడని, ఏడాదిన్నర గడిచినా ఇంత వరకు ఉద్యోగం ఇప్పిచలేదని యశ్వంత్ రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నాటుసారా, బెల్ట్ షాపులపై దాడులు

కొలిమిగుండ్ల, ఆగస్టు 13 : మండలంలోని గొర్విమానుపల్లె, పేట్నికోట, కొలిమిగుండ్ల తదితర గ్రామాల్లో నాటుసారా, బెల్ట్ షాపులపై విస్తృత దాడులు నిర్వహించినట్లు కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు వెల్లడించారు. ఈ దాడుల్లో కొలిమిగుండ్ల సమీపంలోని అక్కదేవతల గుడి వద్ద పిక్కేపల్లితండా చంద్రానాయక్‌ను అరెస్టు చేసి 25లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అదే విధంగా గొర్విమానుపల్లె గ్రామ సమీపంలో మేకల రామానాయుడు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని అక్రమంగా విక్రయిస్తున్న 55 లిక్కర్ బాటిళ్ల స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేశామన్నారు.

డోన్‌లో ఆర్టీఓ తనిఖీలు

రెండు ప్రైవేటు బస్సులకు జరిమానా



డోన్‌లో తనిఖీలు చేస్తున్న ఆర్టీఓ క్రాంతి కుమార్

డోన్(రూరల్), ఆగస్టు 13 : అన్నమయ్య జిల్లాలో ప్రైవేటు స్కూల్ బస్సు రోడ్డు ప్రమాదానికి గురై చిన్నారి మృతి చెందిన సంఘటనతో ఆర్టీఓ అధికారులు అప్రమత్తమయ్యారు. డోన్ ఆర్టీఓ క్రాంతి కుమార్ ప్రైవేటు స్కూల్ బస్సులను తనిఖీలు చేశారు. పట్టణంలోని ద్రోణాచలం పబ్లిక్ స్కూల్ చెందిన ప్రైవేటు బస్సుకు పర్మిట్ లేకపోవడం, డ్రైవర్ లైసెన్సు కలిగి ఉండకపోవడంతో రూ.15వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. అలాగే పర్మిట్ లేకుండా తరలిస్తున్న శ్రీసుధ పాఠశాలకు చెందిన ప్రైవేటు బస్సుకు రూ.10వేలు జరిమానా విధించారు. రెండు ప్రైవేటు బస్సులను జప్తు చేసి ఆర్టీసీ డిపోకు తరలించినట్లు తెలిపారు.

శ్రీరంగాపురంలో 'పొలం బడి'



రైతుకు సూచనలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

రుద్రవరం, ఆగస్టు 13: మండలంలోని శ్రీరంగాపురం గ్రామంలో సోమవారం పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులను పాటించాలన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం ఎలా పొందాలి అన్న విషయాలు రైతులతో ముఖాముఖి నిర్వహించారు. పురుగు మందుల అవశేషాలు లేని పంటలు పండించి ఇన్‌డీ గ్యాప్ సర్టిఫికెట్ ద్వారా అంతర్జాతీయ విపణిలో అధిక లాభాలు ఆర్జించాలన్నారు. ఖరీఫ్‌లో సాగు చేసిన ప్రతి పంటను ప్రతి రైతు రైతు సేవా కేంద్రాల సిబ్బంది కలిసి పంట నమోదు చేసుకోవాలన్నారు. కౌలు రైతులు కౌలు కార్డులు పొందాలన్నారు. తహసీల్దార్ మల్లికార్జునరావు, వ్యవసాయాధికారి శ్రీకృష్ణ, ఏఈవో రాజు, మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి, నరసింహారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి

కోవెలకుంట్ల, ఆగస్టు 13: వరిపైరు సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారి నిరంజన్ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని వెలగటూరులో పొలంబడి నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వర్మీ కంపోస్టు తయారీపై అవగాహన



పెద్దవంగలిలో వర్మీ కంపోస్టు తయారీపై సర్పంచ్‌లకు అవగాహన కల్పిస్తున్న జిల్లా అధికారులు

చాగలమర్రి, ఆగస్టు 13: మండలంలోని పెద్దవంగలి గ్రామంలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు మంగళవారం వర్మీ కంపోస్టు తయారీపై అవగాహన కల్పించారు. డీపీఆర్సీ జిల్లా రిసోర్స్ పర్సన్ దస్తగిరిబాషా మాట్లాడుతూ ప్రకృతి సంపద కేంద్రాల నిర్వహణ, చెత్త సేకరణ గురించి తెలియజేశారు. డంపింగ్ యార్డులను ఏర్పాటు చేసి సంపద కేంద్రాలను సక్రమంగా వినియోగించుకుంటే గ్రామాలకు ఆర్థిక వనరులు సమకూరుతాయని అన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

'చెత్త సంపదతో అదనపు ఆదాయం'

ఉయ్యాలవాడ, ఆగస్టు 13: చెత్త సంపదతో గ్రామ పంచాయతీలకు అదనపు ఆదాయం లభిస్తుందని ఎంపీడీవో ఉమమహేశ్వరరావు తెలిపారు. మంగళవారం గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శులతో కలిసి సర్వాయిపల్లె గ్రామంలోని చెత్త సంపద కేంద్రాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో తడి, పొడి చెత్తను వేరుచేసి వాటిని కేంద్రంలోకి తరలించి కుళ్లబెట్టడం ద్వారా ఎరువుగా వారుతుందన్నారు. దీన్ని రైతులకు విక్రయిస్తే మంచి ఆదాయం వస్తుందన్నారు. అంతేకాకుండా వానపాములతో వర్మీ కంపోస్టు ఎరువును కూడా చెత్త సంపద కేంద్రాలలో తయారు చేయవచ్చన్నారు. వర్మీ కంపోస్టు ఎరువుకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉందన్నారు. ప్రతి గ్రామంలోని చెత్త సంపద కేంద్రాలలో ఎరువు తయారీ చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మహీంధర్‌రెడ్డి ఉన్నారు.

55 శాతం సబ్సిడీతో పైపులు

ఉయ్యాలవాడ, ఆగస్టు 13: రైతులకు 55 శాతం సబ్సిడీతో స్ప్రింకెర్లు, పైపులు అందిస్తున్నామని హార్టికల్చర్ అధికారి ధరణి మంగళవారం తెలిపారు. ఆమె మట్లాడుతూ ఐదు ఎకరాల్లోపు రైతులకు 30 పైపులు, 5 స్ప్రింక్లర్లు ఇస్తామన్నారు. 63 ఎంఎం సైజు పైపులు పూర్తి ధర రూ. 23,984 కాగా రైతు వాటా రూ. 13,063 చెల్లించాలన్నారు. 75 ఎంఎం పైపుల పూర్తి ధర రూ.27,078 కాగా రైతు వాటా 14,748 చెల్లించాలన్నారు. 90 ఎంఎం సైజు పైపుల ధర రూ.32,180 కాగా రైతుల వాటా రూ. 19,576. 110 ఎంఎం ధర రూ. 50,598 కాగా రైతు వాటా 37,008 కట్టాలన్నారు. ఐదు ఎకరాలపై బడి రైతులకు 41 పైపులు, 9 స్ప్రింకెలర్లు ఇస్తామన్నారు. ఇవి కావలసిన రైతులు సబ్సిడీ పోను 63 ఎంఎం సైజు పైపులకు రూ. 34,048, 75 ఎంఎం సైజు పైపులకు రూ. 20,850, 90 ఎంఎం పైపులకు రూ.27,229. 110 ఎంఎం సైజుకు రూ. 51,338 కట్టాలన్నారు. అవసరమైన రైతులు వారి వారి రైతు సేవా కేంద్రాలకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆమె సూచించారు.

కడుపునొప్పి తాళలేక యువకుడి ఆత్మహత్య

బేతంచెర్ల, ఆగస్టు 13: పట్టణంలోని హనుమాన్‌నగర్‌కు చెందిన బోయ ముచ్చు రవి(24) అనే యువకుడు కడుపు నొప్పి తాళలేక మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బోయ రాముడు సుభద్రమ్మ దంపతుల రెండో కుమారుడు రవి. మతిస్థిమితం లేకుండా ఉండటంతో కడుపునొప్పితో బాధపడుతూ ఉండేవాడని తెలిపారు. ఇంట్లో ఎవరూలేని సమయంలో రవి ఉరివేసుకున్నట్లు తల్లిదండ్రులు తెలిపారు.

● **దాడి కేసులో ముగ్గురిపై కేసు:** పట్టణంలోని దుర్గాపేటకు చెందిన గర్బి శ్రీనివాసులు అనే వ్యక్తిపై రాళ్లతో కట్టెలత దాడి చేసిన కేసులో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ షేక్షావలి మంగళవారం తెలిపారు. దుర్గాపేటకు చెందిన గూటంసాయి, గూటం మదన్, గూటం శివదుర్గ ప్రసాద్‌లు గర్బి శ్రీనివా సులుపై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.